ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శనివారం 17 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా)

17-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	28
తెనాలి	39	28
నరసరావుపేట	39	26
బాపట్ల	37	28
రెంటచింతల	39	25
చీరాల	37	28


నరసరావుపేట : మొక్కజొన్న కల్లంలో నిలిచిన నీరు


గుంటూరు : గాలులకు రోడ్డుపై కూలిన భారీ వృక్షం



గుంటూరు : బస్టాండ్ గ్యారేజీలో చేరిన వర్షపునీరు


కొల్లూరు : గాజుల్లంక వద్ద వర్షానికి తడిసిన పచ్చి ఇటుక

ఉరుములు.. పిడుగులు

- పలు ప్రాంతాల్లో అర్ధరాత్రి బీభత్సం,
- పల్నాడులో ఓ మోస్తరుగా.. గుంటూరు,బాపట్లలో భారీగా వర్షం
- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్‌లు
- లోతట్టు ప్రాంతాలు జలమయం... మురుగుతో రోడ్లు దుర్గంధం
- విద్యుత్, తాగునీటి సరఫరా లేక ప్రజల అవస్థలు


గుంటూరులో కంకరగుంట అండర్ బ్రిడ్జిలో చేరిన వర్షపు నీరు


యడ్లపాడు : కొత్తపాలెంలో నేలవాలిన దొండ పందిళ్లు

గుంటూరు, నరసరావుపేట, బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉరుములు.. మెరుపులు.. పిడుగులు.. గాలి వాన.. అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిద్రిస్తున్న వేళ బీభత్సం. నిశీరాత్రిలో భీకరమైన శబ్ధంతో ఉరుములు, కళ్లు మిరు మిట్లు గొలిపేలా ఆకాశంలో మెరుపులు, ఈదురుగాలితో కూడిన జోరు వర్షంతో గుంటూరు, బాపట్ల జిల్లా, పల్నాడు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రజలు వణికిపోయారు. నడి వేసవిలో వాతావరణ శాఖ అంచనాకు మించి ఈదరు గాలులతో కూడిన వర్షం పడింది. గుంటూరు జిల్లాలో శుక్ర వారం వేకువజామునకు ముందు 2 గంటల తర్వాత నుంచి ప్రారంభమైన ప్రకృతి విపత్తు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. బాపట్ల జిల్లాలో తెల్లవారుజామున నాలుగుగంటల సమ యంలో మొదలైన వర్షం దాదాపు మూడు గంటల పాటు కుండపోతగా కురిసింది. పలుచోట్ల పిడుగులు పడగా గాలి కారణంగా వర్షం పెద్దగా కురవదేమోనని అంతా భావిం చగా అందుకు విరుద్ధంగా భారీ వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా వర్షంతో లోతట్టు ప్రాంతాల్లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ఈదురుగాలులకు చెట్లు, రేకుల షెడ్లు, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు, తోపుడు బండ్లు, టీ కొట్లు బల్లలు కూడా కొంతదూరం కొట్టుకుపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, దీనిపై తాగునీటి సరఫరా ఆధార పడి ఉండటంతో రెండింటికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం వర్షం వెలిశాక విద్యుత్ సిబ్బంది సహాయక చర్యలను ప్రారంభించినా కొన్ని ప్రాంతాల్లో సాయంత్రానికి కూడా విద్యుత్ పునరుద్ధరణ సాధ్యం కాలే దు. దీంతో ప్రజలు అటు కరెంటు లేక.. ఇటు తాగునీటి సరఫరా లేక రోజంతా అల్లాడిపోయారు. గాలికి భారీ వర్షం జత కలవడంతో రాత్రి అంతా విద్యుత్ సరఫరాని నిలిపే యడంతో ప్రజలు జాగారం చేయాల్సి వచ్చింది. ఉదయం 7 గంటల వరకు అడపాదడపాగా వర్షం కురుస్తూనే ఉన్నది. అన్ని ప్రాంతాల్లో ఓ మోస్తారు వర్షాలు కురవడంతో వాతా వరణం చల్లబడి వారం రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు ఉపశమనం పొందారు.

- పల్నాడు జిల్లా అంతటా గురువారం అర్ధరాత్రి నుంచి కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కల్లాల్లోని పంటలు తడిచిపోయి అన్నదాతలు నష్టపోయారు. అచ్చంపేటలో భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి అమరావతి మండల పరిధి లోని మండెపూడిలో సఫావత్ సాంబయ్య నాయక్ కు టుంబ సభ్యులు ఇంటిలో నిద్రిస్తుండగా ఆకస్మాత్తుగా పిడు గు పడగా వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే ఇల్లు పూర్తిగా దెబ్బతింది.
- నిజాంపట్నం మండలంలోని అడవుల దీవి గ్రామంలో ఉన్న దేవాలయంలో గాలులకు ధ్వజస్తంభం విరిగి పడింది. చీరాలలోని పలువీధులు వర్షపునీటితో తటాకాలను తల పించాయి. వేటపాలెం మండలం దేశాయిపేట వద్ద గాలు లకు చెట్టు నేలకొరిగి రోడ్డుమీద పడడంతో రవాణా స్తం భించింది. పర్చూరురోడ్డులోని పూసపాడు సమీపంలోని నక్కల వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు అంతరాయం ఏర్పడింది. బాపట్ల పట్టణంలోని బేతనీయ కాలనీలో గం టల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చీరాల, రేపల్లె పరిధిలోని పలు ఏరియాల్లో సైతం కరెంటు సరఫరాకు విఘాతం ఏర్పడింది.
- అమరావతి రాజధానిలోనూ వర్షం ప్రతాపం చూ పించింది. జోరుగా కురిసిన వర్షంతో నేల అంతా బురదమయంగా మారింది. దీంతో వేగవంతంగా జరుగుతోన్న నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. పనులు తిరిగి ప్రారంభం కావడానికి మూడు, నాలుగు రోజుల సమయం పడుతుందని స్థానికులు తెలిపారు. తాడికొండ తహసీల్దార్ కార్యాలయంలో రేకుల షెడ్డు కూలిపోయింది.
- గుంటూరు నగరంలో విద్యుత్‌శాఖకు రూ.10 లక్షల నష్టంగా అంచనా వేస్తున్నట్లు టౌన్-1 ఆపరేషన్ ఈఈ శ్రీని వాసబాబు తెలిపారు. రెండు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ (డీటీఆర్) దెబ్బతినటంతో పాటు విద్యుత్ పోల్స్ దెబ్బతిని నష్టం వాటిల్లిందన్నారు. చెట్లు ఎక్కడికక్కడ నేల కొరిగి విద్యుత్ తీగెలపై పడటంతో నగరంలో పలు ప్రాంతా ల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపై రాకపోకలు కూడా స్తంభించిపోయాయి. గార్డెన్స్‌లోని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కార్యాలయం ఎదుటనే భారీ వృక్షం నేలకొరిగి విద్యుత్‌పోల్ పడిపోయి సరఫరా నిలిచిపోయింది. కాలువల్లోని మురుగు అంతా రోడ్ల పైకి చేరి దుర్గంధాన్ని వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అచ్చంపేటలో 7.25 సె.మీ వర్షపాతం

అచ్చంపేటలో 7.25 సెమీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపిం ది. మండలాల వారీగా వర్షపాతం అమరావతి 43.5 మీమీ, యడ్లపాడు మండలంలో 39.2 మీమీ, బెల్లంకొండ 34.3 మీమీ, క్రోసూరు 31.3, సత్తెనపల్లి 33.5 మీమీ, గురజాల 32.5, నకరికల్లు 31.4, నరసరావుపేట 38.7, శావల్యాపు రం 25.3, బొల్లాపల్లి 29.4 మీమీ, మా చర్ల 23.4 మీమీ, వెల్దుర్తి 22.8, దుర్గి 24.6, రెంటచింతల 26.9, కారంపూడి 30.7, పిడుగురాళ్ల 25.8, దాచేపల్లి 25, మాచవరం 20.3, పెదకూరపాడు 21.5, రాజుపాలెం 31.5, వినుకొండ 24.1, నూ జెండ్ల 31.6, ఈపూరు 28.3, రొంపిచర్ల 19.6, ముప్పాళ్ల 25.1, నాదెండ్ల 19.6, చిలకలూరిపేట 27.5 మీమీ వర్షపాతం నమోదైంది.

గుంటూరులో భారీ వర్షం

గుంటూరులో 82.5, తుళ్లూరులో 78, మంగళగిరిలో 71, తాడికొండలో 32.5, పొన్నూరులో 20.5, దుగ్గిరాలలో 17.5, ఫిరంగిపురంలో 12.5, తాడేపల్లి లో 10.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మూడు గంటల్లో 42.87మి.మీ. వర్షపాతం

బాపట్ల జిల్లాలో మూడు గంటల్లో సగటున 42.87మి.మీ. వర్షపాతం నమోదైంది. కాగా అత్యధికంగా అత్యధికంగా యద్దనపూడి మం డలంలో 128 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా వేమూరులో 8.4 మిల్లీమీటర్ల వర్షం కురి సింది. పర్చూరు 81.4, చీరాల 79.8, ఇంకొల్లు 69.2, బాపట్ల 64.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. చెరుకుపల్లి 30.4, పిట్టలవానిపాలెం, కర్లపా లెం మండలాల్లో 38.6 మి.మీ. వర్షం కురిసింది.


నారాకోడూరు వద్ద నేలవాలిన దొండ పందిరి

రైతులకు కొంత మేర నష్టం..

బాపట్ల, పల్నాడు ప్రాంతంలో కల్లాల్లోని మిర్చిపై రైతులు పరదాలు కప్పి జాగ్రత్తలు పాటించినా గాలివానకు నష్టపోయారు. కల్లాల్లో, ఇంటి ప్రాంగణాల్లో నిల్వ చేసిన నల్లబర్లి పొగాకు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ ధాన్యం చాలా వరకు కోతలు పూర్తయి పంటను అటు కొనుగోలు కేంద్రాలకు తరలించడమో లేక నిల్వ చేసుకోవడమో చేయడంతో ధాన్యం రైతులపై ఈ అకాల వర్షం ప్రభావం పెద్దగా పడలేదు. అయితే సరైన ధర లేక విలవిలలాడుతున్న బర్లీ పొగాకు రైతులు అకాల వర్షం దెబ్బకు మరింత కుదేలయ్యారు. ఈదురుగాలులు ధాటికి వందల ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. బాపట్ల జిల్లాలో దాదాపు 850 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు చెబుతున్నారు. గాలివాన, వర్షంతో ఉద్యాన పంటల రైతులు విలవిల్లాడిపో యారు. సంగంజాగర్లమూడి, అంగలకుదురు వంటి పలు గ్రామాల్లో నిమ్మతోటల్లో పిందె దశలో ఉన్న కాయలు గాలి వేగానికి రాలి పోవ డంతో రైతులు ఆందోళన చెందారు. కొల్లిపర మండలంలో పలుచోట్ల అరటి తోటలు దెబ్బతిన్నాయి. గాలివాన పొన్నూరు చేబ్రోలు మండలాల్లో వాణిజ్య పంటల రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. పొన్నూరు ప్రాంతంలో గా లుల బీభత్సానికి అవిశె తోటలు విరిగిపడడం తో తమలపాకు పంట నేలమట్టమైంది. చేబ్రో లు మండలం నారాకోడూరు, వేజెండ్ల, శలపా డు ప్రాంతాల్లో తీగ జాతి కూరగాయ పంటలు పందిళ్లు నేలమట్టమయ్యాయి.

నాడు తిన్నారు.. నేడు బలయ్యారు

- వైసీపీ హయాంలో రక్షణ.. నేడు సస్పెన్షన్
- పది మంది మున్సిపల్ ఉద్యోగులపై వేటుతో కలకలం
- మరో నలుగురు అధికారులపై చర్యలకు సిఫార్సు
- చిలకలూరిపేట పురపాలక సంఘంలో రూ.34 లక్షలు గోల్‌మాల్
- అజ్ఞాతంలోనే ఉన్న సూత్రధారైన అవుట్ సోర్సింగ్ ఉద్యోగి

చిలకలూరిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): అధికారం అండతో నాడు మున్సిపల్ ఖజానాకు గండికొట్టారు. అక్రమాలపై నాడు టీడీపీ ఆందోళన చేసినా అటు ప్రభుత్వం.. ఇటు పుర పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు వారి పాపం పండి నేడు బలయ్యారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో రూ.34 లక్షల నిధులు గోల్‌మాల్ చేసిన పది మంది ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ మున్సిపల్ శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేసారి పదిమంది ఉద్యోగులు సస్పెండ్ కావడం సంచలనం కలిగించింది. అప్పట్లో చిలకలూరిపేటలో పనిచేస్తూ ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ఆయా ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా ఒకరు ఉద్యోగ విరమణ చేశారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసిన ఇక్కుర్తి గంగాభవాని నిధుల గోల్‌మాల్‌లో కీలకంగా వ్యవహరించగా ప్రస్తుతం అజ్ఞాతంలోకి వెళ్లింది. 2021 మే నుంచి 2023 జూలై మధ్య మున్సిపల్ కార్యాలయంలో షరాబు దగ్గర గంగాభవాని కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసింది. ఆ సమయంలో మున్సిపాల్ దుకాణదారులు చెల్లించే అద్దెలను ఖజానాకు జమ చేయలేదు. అనుమానం రాకుండా దొంగ రశీదులతో మాయ చేసింది. ఇలా రూ.34.34 లక్షలు గల్లంతు చేయగా అప్పట్లో టీడీపీ కౌన్సిలర్లు అనేకసార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించారు. అయితే వైసీపీ హయాంలో ఆమెపై ఈగ వాలకుండా చేశారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దుకాణాల అద్దెల గల్లంతుపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. దీంతో అక్రమార్కులు కాజేసిన మొత్తంలో రూ.12.94 లక్షలు మున్సిపల్ ఖజానాకు జమ చేశారు. నిధుల గల్లంతులో సూత్రధారి గంగాభవాని కాగా ఆమెకు పలువురు అధికారులు, ఉద్యోగులు సహకరించినట్లు విచారణలో తేలింది.నిధుల గోల్‌మాల్‌లో మొత్తం 15 మందిని బాధ్యులుగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. గతంలో ఇక్కడ కమిషనర్లుగా పనిచేసిన సీహెచ్ గోవిందరావు(ప్రస్తుతం అమరావతి సెక్రటేరియట్లో సెక్షన్ ఆఫీసర్), రవీంద్ర(అద్దంకి కమిషనర్), చిలకలూరిపేట ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరించి ప్రస్తుతం డీఈగా ఉన్న రహీం, అప్పట్లో మేనేజర్‌గా వ్యవహరించి ప్రస్తుతం ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ ఆఫీసులో ఏవోగా ఉన్న నగీనా సుల్తానాలపై చర్యలకు విచారణాధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కాగా తొలుత గంగాభవానిపై చిలకలూరిపేట అర్బన్ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు కావడంతో ఆమె అప్పటి నుంచి అజ్ఞాతంలో ఉంది.

సస్పెన్షన్ అయిన వారు..

చిలకలూరిపేట : అబ్దుల్‌ఖాదర్(ఆర్ఐ), రమేష్‌బాబు(సీనియర్ అసిస్టెంట్), విశ్రాంత ఉద్యోగి షేక్ కాలేషా(జూనియర్ అసిస్టెంట్ షరాబు)
నరసరావుపేట: ధనలక్ష్మి(సీనియర్ అసిస్టెంట్), టీ గురవయ్య, షేక్ జమీర్, జీ శ్రీనివాసమూర్తి, అల్లాభక్షు(జూనియర్ అసిస్టెంట్లు)
చీరాల: మానసకృష్ణ(సీనియర్ అకౌంటెంట్)
వెంకటగిరి: జీ వెంకటేశ్వర్లు(జూనియర్ అసిస్టెంట్)
గూడూరు: విజయలక్ష్మి(మేనేజర్)

పచ్చిరొట్ట విత్తనాలకు.. 50 శాతం రాయితీ



- రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ ఏర్పాట్లు
- పచ్చిరొట్ట పైర్ల సాగుకు ప్రభుత్వం చేయూత
- జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు సిద్ధం
- జిల్లాకు 5,344 క్వింటాళ్ల విత్తనాలు కేటాయింపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
ఖరీఫ్ సమీపిస్తోంది. అడపా దడపా వర్షాలు పడుతున్నాయి. ముందస్తు రుతుపవనాలపై వాతా వరణశాఖ తీపికబురు చెప్పింది. కూడా రైతులు సాగుకు సమా యత్తమవుతున్నారు. వ్యవసాయ శాఖ కూడా సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో ముందస్తుగా పచ్చిరొట్ట పైర్ల సాగుకు ప్రభుత్వం చేయూత ఇస్తోంది. ఈ పైర్ల విత్తనాలను 50 శాతం రాయితీపై రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీకి వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. రైతులు ప్రధానంగా వరిసాగు చేసే పొల్లాల్లో పచ్చిరొట్ట పైర్లను సాగు చేస్తారు. ఈక్రమంలో మండలాల వారీగా విత్తన అవసరాలను గుర్తించి అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో జిల్లాకు 5,344 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించింది. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాల ద్వారా రైతులకు రూ.3.93 కోట్లు రాయితీ ఇస్తోంది. రాయితీ పోను జీలుగ కిలో రూ.61.50, జనుము రూ.54.50, పిల్లిపెసర రూ.90 ధర నిర్ణయించారు.

కేటాయింపులు క్వింటాళ్లలో..

నియోజకవర్గం	జీలుగ	జనుము	పిల్లిపెసర
నరసరావుపేట	471.5	229	171.2
చిలకలూరిపేట	44	180	113.04
వినుకొండ	354.1	290.1	131.48
గురజాల	464.9	270.9	177.16
మాచర్ల	411.4	29.4	88
సత్తెనపల్లి	525.3	355.4	184.84
పెదకూరపాడు	305.8	174.2	297.28

తక్కువ ఖర్చుతో పోషకాలు..

పచ్చిరొట్ట పైర్ల పెంపకం ద్వారా తక్కువ ఖర్చుతో భూమికి ఎక్కువ పోషకాలను అందిస్తుంది. జనుము, జీలుగ, పిల్లిపెసర, పెసర పూత రావ డానికి 40 నుంచి 50 రోజులు పడు తుంది. పూమొగ్గ దశలో భూమిలో కలియదున్నడాన్ని పచ్చిరొట్ట ఎరువు గా పరిగణిస్తారు. ఈ పైర్ల సాగులో జీలుగ, జనుము ప్రాచుర్యంలో ఉన్నాయి. ఇవి తక్కువ సమయంలో ఎక్కు వ ఎరువును అందిస్తాయి.వీటి ద్వారా పంటలకు నత్రజని అధిక మోతాదులో అందు తుంది. పర్యావరణం దెబ్బ తినకుండా ఉంటుంది. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గి రైతులకు సాగు ఖర్చు కూడా తగ్గి నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ జేడీ మురళి తెలి పారు. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 10 కిలోల కిట్ విలువ రూ.1296 కాగా రాయితీ పోను రూ.648 రైతులకు పంపిణీ చేస్తామన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

భూముల రీ సర్వేలో మన విధానం భేష్

- తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామన్న ప్రతినిధులు
- రెండు రోజుల జాతీయ కార్యశాల నిర్వహణతో గుంటూరుకు ఖ్యాతి
- కేంద్ర మంత్రి పెమ్మసాని, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం

8

ఆర్టీసీలో.. కొరియర్ సేవలు సులభతరం

- త్వరలో ఆర్టీసీ ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్
- కండక్టర్‌కి ఇస్తే.. పార్శిల్ కొరియర్

తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభం


తిరంగా ర్యాలీలో పాల్గొన్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు , మక్కెన

ప్రపంచానికి భారత్ సత్తా చాటిన సిందూర్

- వినుకొండ తిరంగా ర్యాలీలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రదాడికి ప్రతీకారంగా సైనిక బలగాలు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ మన దేశ సత్తాను ప్రపంచానికి చాటిచెప్పిందని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. సైనికులను అభినందిస్తూ శుక్రవారం వినుకొండలో తిరంగా ర్యాలీ జరిగింది. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి శివయ్యస్థూపం, కారంపూడి రోడ్డు, సురేష్‌మహల్ రోడ్డు మీదగా సాగింది. ర్యాలీలో జాతీయ సమైక్యత, సమగ్రతను చాటేలా గీతాలపనలతో పాటు.. భారత్‌మాతాకీ జై, జైహింద్, వందేమాతరం వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ కశ్మీర్‌లో అమాయకులను బలితీసుకున్న ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పిన ప్రధాని మోదీ, ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేసిన త్రివిధ దళాలకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఇకపై ఉగ్రవాదులు దేశం వైపు కన్నెత్తి చూడాలంటే భయపడేలా ఆపరేషన్ సిందూర్ నిర్వ హించారని ప్రశంసిం చారు. ఈ పోరాటంలో అమరుడైన వీర జవాన్ మురళీనాయక్‌కు జోహార్లు అర్పిస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆపరేషన్ సిందూర్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించి దేశా నికి అండగా నిలిచార న్నారు. దేశంలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్, జైనార్టీలు అంతా ఒకటేనని 145 కోట్ల మంది సమైక్యతను చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, విద్యార్థులు, యువత, కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


నరసరావుపేటలో తిరంగా ర్యాలీలో ప్రదర్శించిన మూడు వందల అడుగుల జాతీయ జెండా


ఎంపికైన లిఫ్టర్లతో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

మంగళగిరి సిటీ, మే 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న జాతీయ సబ్ జూనియర్, జూనియర్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా నుంచి 9 మంది పవర్ లిఫ్టర్లు ఎంపికయ్యారని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. మహిళల సబ్ జూనియర్స్‌లో బి.లాలిత్య (76 కేజీలు), ఈఎల్ వినయశ్రీ (84 కేజీలు), పురుషుల సబ్ జూనియర్స్‌లో టి.శివకార్తిక్ (53 కేజీలు), ఎస్.మునీశ్వర్ రామ్ (83కేజీలు), మహిళల జూనియర్స్‌లో ఎం.షానూన్ (47కేజీలు), ఎల్.చాతుర్య (76 కేజీలు), ఎన్.జ్ఞానదివ్య (84+కేజీల విభాగం), పురుషుల జూనియర్స్‌లో ఎస్.కౌశిక్ (93 కేజీలు), డి.పృథ్వీ కుమార్ (105 కేజీలు) ఎంపికయ్యారని వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లిఫ్టర్లను ఏపీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, సౌత్‌ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్ఎస్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

మిర్చియార్డులో కలకలం

- అక్రమాలకు పాల్పడిన 18 మందిపై శాఖాపరమైన చర్యలు
- సస్పెన్షన్లు, సెన్సూర్, ఇంక్రిమెంట్ల కోత పెట్టే అవకాశం



గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం, ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనలపై ఎట్టకేలకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ అందజేసిన నివేదిక ఆధారంగా 18 మంది అధికారులపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించింది. ఇందులో భాగంగా బాధ్యులైన ఉద్యోగులపై సస్పెన్షన్ చర్యలు కూడా త్వరలో చేపట్టే అవకాశం ఉన్నట్లు మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ జీవో ఆర్‌టీ నంబరు. 275 జారీ చేశారు. ఈ ఉత్తర్వులు సాయంత్రానికి మిర్చియార్డుకు చేరుకోవడంతో ఉద్యోగవర్గాల్లో కలకలం రేకెత్తించింది. త్వరలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకొంటుందోనన్న ఆందోళన వారిలో నెలకొన్నది. కచ్చితంగా సస్పెన్షన్లు, సెన్సూర్‌లు, ఇంక్రిమెంట్ల కోత వంటి చర్యలుంటాయని అంచనా వేస్తున్నారు.

మిర్చియార్డులో వైసీపీ పాలనలో అటు ఆ పార్టీ నేతలు, ఇటు అధికారులు, ఉద్యోగులు అందినకాడికి దోచుకొన్నారు. అవినీతికి కాదేది అనర్హం అన్నట్లు యార్డులో అణువణువునా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ దోచేశారు. జీరో బిజినెస్, కటింగ్, బిల్ టూ బిల్ వ్యాపారాలు, ఈనామ్‌లో మిర్చి టిక్కీల లెక్కల తారుమారు వంటి అక్రమాలకు పాల్పడ్డారు. అలానే లైసెన్సుల రెన్యువల్, భాగస్వామ్య పేర్ల మార్పులు పెద్దఎత్తున చేశారు. కొత్త లైసెన్సులు నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేశారు. సెక్యూరిటీ డిపాజిట్లు మార్కెట్ కమిటీకి రాకుండా కోర్టులలో బలహీనంగా వాదనలు వినిపించారు. షాపుల సబ్‌లీజులు, చేతులు మారిన పర్మినెంట్ షాపుల పేర్ల మార్పులు వంటివి చేసి రూ. కోట్లు వెనకేసుకొన్నారు. దీనిపై మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏ ఎస్ రామకృష్ణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌కు ఫిర్యాదు చేయడంతో విజిలెన్స్ విచారణ గత ఏడాది ఆఖరులో జరిగింది. ఆ శాఖ అధికారులు విచారణ జరిపి రూ. 347 కోట్ల అవినీతి జరిగిందని నివేదిక సమర్పించగా దానిని యథాతథంగా విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి పంపి చర్యలకు సిఫార్సు చేశారు. మిర్చియార్డు గత ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డితో పాటు గ్రేడ్-2 సెక్రెటరీ కే శివారెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీలు వీ ఆనందభాస్కర్, కే జయరామిరెడ్డి, సూపర్‌వైజర్లు కే సాంబిరెడ్డి, షేక్ అబ్దుల్ కరీం, సీహెచ్ శివారెడ్డి, కే వెంకట దుర్గా శివనాగరాజు, జీ మురళీకృష్ణ, షేక్ ముస్తఫా, ఎం శ్రీనివాసరావు, జీ యలమంద, ఎం రమేష్‌బాబు, సీహెచ్ పెద్దారావు, ఎం వీ రాఘవరావు, జూనియర్ మార్కెట్ సూపర్‌వైజర్లు షేక్ ఖాజా, టీ శేషుబాబు, డ్రైవర్ కే శ్రీనివాసరావులపై చర్యలకు విజిలెన్స్ సిఫార్సు చేసింది. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించి వైసీపీకి అనుకూలంగా వీరిలో ఒకరిద్దరు ప్రచారం కూడా చేశారు. దాంతో దానిపైనా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. విజిలెన్స్ విచారణలో భాగంగా మిర్చియార్డులో ఛైర్మన్లుగా బాధ్యతలు నిర్వహించిన వైసీపీ నేతలను కూడా విచారించింది. అయితే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.


రాజధాని రైతులను కలిసి అభిప్రాయాలు తీసుకుంటున్న టీఐఎస్ఎస్ విద్యార్థులు

స్వచ్ఛందంగానే రాజధానికి భూములిచ్చాం

- టీఐఎస్ఎస్ విద్యార్థుల సర్వేలో రైతుల వెల్లడి

తుళ్లూరు,మే 16,(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛందంగా రాజధాని అమరావతికి భూములిచ్చామని రైతులు స్పష్టం చేస్తున్నారు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టీఐఎస్ఎస్)కి చెందిన లా సోషల్ పాలసీ, ఎంఏ ఇన్ పబ్లిక్ పాలసీ విద్యార్థులు అమరావతిలో ల్యాండ్ పూలింగ్‌పై ప్రాజెక్ట్ వర్క్ చేశారు. రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారా? ఇచ్చిన తర్వాత వారి జీవన, వ్యవహార శైలీ, వ్యవసాయ కూలీల పరిస్థితి, యువతకు ఉద్యోగ అవకాశాలు, విద్య, వైద్య సదుపాయాలు తదితర అంశాలు, అందుకు ప్రభుత్వ చర్యలను పరిశీలించారు. శుక్రవారం నుంచి రాజధాని 29 గ్రామాలలో బృందాలుగా విద్యార్థులు సర్వే చేశారు. ఈ సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి, వరల్డ్ బ్యాంకుకు అందజేయనున్నారు. స్వచ్ఛందంగానే భూములు ఇచ్చామని, చిన్న చిన్న సమస్యలున్నా.. వాటిని సీఆర్‌డీఏ పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటోందని సర్వే టీం సభ్యులకు రైతులు స్పష్టం చేశారు. రాజధాని ప్రకటన ముందు నుంచే.. ఇక్కడే నివాసాలున్న వారిని గుర్తించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, వైద్యశాలల్లో ఓపీ నుండి ఆపరేషన్ దాక ఉచిత వైద్యం అందజేయాలని కొందరు రైతులు కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతి హెల్త్ కార్డులు ఇచ్చారని వైసీపీ ప్రభుత్వంలో అవి సరిగా పని చేయలేదని చెప్పారు. అమరావతి అభివృద్ధి పనులు వేగవంతంగా చేసి రైతుల ప్లాట్లకు విలువ పెంచాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. రాజధాని అమరావతికి అదనంగా 45 వేల ఎకరాలు ప్రభుత్వం తీసుకోవాలనే దాని మీద సర్వే సభ్యులు వివరణ కోరగా.. అమరావతి నగరం 217 చదరపు కిలోమీటర్లు పరిధి అభివృద్ధి చేస్తే, పక్కన ఉన్న రైతులు తమ లాగే స్వచ్ఛందంగా ల్యాండు పూలింగ్‌కి భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీఐఎస్ఎస్ సర్వే విద్యార్థులకు వీఐటీలో వసతి సౌకర్య కల్పించారు.

కబలించిన లారీ..!

- స్కూటీని ఢీకొట్టడంతో తల్లి మృతి, కూతురికి గాయాలు
- న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి బంధువుల ఆందోళన

కొల్లూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో తల్లి అక్కడికక్కడే మృతి చెందగా.. కుమార్తె తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. అమృతలూరు మండలం మూల్పూరుకు చెందిన ఇంటూరి రూప (36) తమ కుమార్తె సుభాషిణితో కలిసి పుట్టినిల్లు దోనేపూడి శివారు గ్రామం ఆలపాటి నగర్‌లో బంధువుల వివాహ వేడుకకు గురువారం వచ్చారు. ఉదయం తిరిగి తన స్కూటీపై వెళ్తుండగా.. మండల పరిధిలోని మొసలిపాడు చెరువు వద్ద కొల్లూరు నుంచి వస్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న రూప రోడ్డుపై పడిపోవడంతో లారీ ఆమె పైనుంచి వెళ్లింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్కూటీ నడుపుతున్న కుమార్తె సుభాషిణి తీవ్రంగా గాయపడింది. గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రురాలిని 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో స్కూటీ పూర్తిగా దెబ్బతింది. సమాచారం తెలుసుకున్న ఏఎస్ఐ అర్జున్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కుమార్తె మృతి విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, భర్త యిర్మియా, బంధువులు ఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై బైఠాయించారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. వేమూరు ఎస్ఐ శివకృష్ణ, సిబ్బంది వారితో చర్చించారు. వారిని స్టేషన్‌కు తీసుకు వెళ్లగా రాత్రి 7 గంటల వరకు చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. మృతదేహం ఘటనా స్థలంలోనే ఉండిపోయింది. దీంతో భారీ ట్రాఫిక్ జామ్ కావడంతో.. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకున్నారు.


రోడ్డుపై ధర్నా చేస్తున్న మృతురాలు బంధువులు

జ్యోతిర్మయికి నీట్ పీజీలో ఆలిండియా 47వ ర్యాంక్



బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల పట్టణానికి చెందిన వీటా జ్యోతిర్మయి నీట్ పీజీ ఎండీఎస్ ప్రవేశ పరీక్షలో ఆలిండియా 47వ ర్యాంక్ సాధించింది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన జ్యోతిర్మయి ఇంటర్మీడియెట్‌లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంక్ సాధించింది. సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్‌లో బి.డి.ఎస్ పూర్తి చేసింది. తల్లిదండ్రులు శ్రీనివాస్, విజయలక్ష్మీ కుమార్తెకు ర్యాంక్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

'గోపాలమిత్ర' వ్యవస్థ పరిశీలనకు కమిటీ

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖలోని గోపాలమిత్ర వ్యవస్థ పనితీరును పరిశీలించడానికి ప్రభుత్వం ఒక కమిటీని నియమించింది. ఏపీ లైవ్‌స్టాక్ ఏజెన్సీ సీఈవో అధ్యక్షతన పశుసంవర్ధక, పశు వైద్య నిపుణులు ఈ కమిటీలో సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019కు ముందున్న విధంగా గోపాలమిత్ర వ్యవస్థను కొనసాగించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, గ్రామ పశుసంవర్ధక సహాయకులు, గోపాలమిత్రల మధ్య జాబ్‌చార్ట్‌పై స్పష్టమైన హద్దును కమిటీ సూచించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సైన్యానికి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలి

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడుతున్న సైనికులకు ప్రజలంతా అండగా నిలవాలని రైల్వే గుంటూరు సీనియర్ డీసీఎం సీహెచ్ ప్రదీప్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయం నుంచి ఆపరేషన్ సింధూర్ - సాలిడారిటీ ర్యాలీని రైల్వేస్టేషన్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డీసీఎం మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారతదేశం ఆపరేషన్ సింధూర్‌ని ప్రారంభించిందన్నారు. ఉగ్రవాదుల పీచమణిచి బాధిత కుటుంబాలకు న్యాయం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ ఎం రవికిరణ్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, ఏఎస్‌సీ శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

పది జిల్లాల్లో డీసీహెచ్‌లు మార్పు

అమరావతి, మే 16 (ఆంధ్రజ్యోతి): పనితీరు సరిగా లేదనే కారణంతో వైద్య ఆరోగ్య శాఖ పది జిల్లాలకు కొత్త జిల్లా కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీసీహెచ్)లను నియమించింది. అల్లూరి సీతారామరాజు, కోనసీమ, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, బాపట్ల, పల్నాడు, తిరుపతి, నంద్యాల, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో డీసీహెచ్‌లను మార్చింది. గత మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరును ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షించి, ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే పది జిల్లాల అధికారులను మార్చారు.

యడ్లపాడులో దొంగల హల్‌చల్

నగదు, వెండి, బంగారు ఆభరణాల చోరీ

యడ్లపాడు, మే 16 (ఆంధ్రజోతి): మండల కేంద్రంలో గత అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఖాళీగా ఉన్న రెండు గృహాల్లో చోరీకి యత్నించారు. గ్రామానికి చెందిన కారు డ్రైవర్ నరవర్య హనుమాన్‌సింగ్ గురువారం ఉదయం డ్యూటీకి వెళ్లి అర్ధరాత్రి 2 గంటల ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి తలుపు తాళం పగుల గొట్టి ఉండడాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా చిందర వందరగా వస్తువు పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించాడు. అతని కుటుంబ సభ్యులంతా మూడు రోజుల క్రితం మహబూబ్‌నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు బీరువాలో దాచి ఉంచిన నగదు రూ.20 వేల నగదు, సుమారు 500 గ్రాముల వెండి ఆభరణాలు, ప్రతిమలు, 8 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. అలాగే హనుమాన్‌సింగ్ ఇంటి ఎదురుగా ఉన్న దండా ప్రమీల నివాసంలో కూడా చోరీయత్నం చేశారు. తాళం పగులగొట్టి లోపలికి వెళ్లి దొంగలు విలువైన వస్తువులు లేకపోవడంతో పాటు.. వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఒంటిరిగా ఉంటున్న ప్రమీల ఇటీవల మోకాలు ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్‌లోని కుమారుడి వద్దకు వెళ్లినట్లు సమీప బంధువులు తెలిపరు. ఎస్ఐ శివరామకృష్ణ ఘటనా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. రెండు ఇళ్లల్లో ఒకే విధంగా తాళాలు పగులగొట్టిన విధానం చూసి, ప్రొఫెషనల్ దుండగుల పని అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. గ్రామంలో ఇటీవల దొంగతనాలు పెరుగుతుండడంతో ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తెనాలి రూరల్, మే16 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు శుక్రవారం తెలిపారు. ఎస్ఐ వెంకటాద్రి వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్లెపాడు రైల్వే గేటు సమీపంలో రైల్వే ట్రాక్‌పై సుమారు 35 నుండి 40 ఏళ్ల వయసున్న వ్యక్తి రైలు కింద మృతి చెందాడు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల మార్చురీకి తరలించి, విచారణ చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడిని గుర్తిస్తే రైల్వే పోలీస్ ఫోను నంబరు 72070 76614 సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

చేపల చెరువులో పడి వ్యవసాయ కూలీ మృతి


ఏడుకొండలు (ఫైల్ ఫొటో)

నూజెండ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కూలీ ప్రమాదవశాత్తు చేపల చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా ఒంగోలు మండలం శరగానివారిపాలేనికి చెందిన సీహెచ్ ఏడుకొండలు(55) వ్యవసాయ పనులకు వెళ్తూ..చేపలు పడుతుంటాడు. నూజెండ్ల మండలంలోని వీ అప్పాపురం గ్రామంలో చేపలు పట్టేందుకు ముఠాలో కూలీగా వచ్చి ప్రమాదానికి గురయ్యాడు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బీవీ కృష్ణారావు పరిశీలించారు. శుక్రవారం మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి


వజ్రగిరి కోటమ్మ(ఫైల్ ఫొటో)

నూజెండ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మృత్యుంజాపురం గ్రామానికి చెందిన వజ్రగిరి కొండమ్మ(45) ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గుట్లపల్లి జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. పుల్లల చెరువు మండలం తోటపాచర్లలో బంధువుల ఇంటికి వెళ్లి వస్తున్న సందర్భంలో ఆమె ప్రయాణిస్తున్న కారు కట్టెల ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొదముల కుమారి, షారోన్, ప్రశాంత్ రాజుకు గాయాలయ్యాయి.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



పొన్నూరుటౌన్, మే 16: పట్టణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం బస్ సెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని అర్బన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం అర్ధరాత్రి పట్టణంలోని గుంటూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న సెల్టర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి.. పోలీసులకు సమాచరం అందించారు. అక్కడికి చేరుకున్న అర్బన్ పోలీసులు వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుడు ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి తిరిగి వెళ్లడానికి బస్‌షెల్టర్ వేచి ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పంచానామా నిమిత్తం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయంలో సాంకేతికను వినియోగించాలి

- వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి

లాంఫాం(తాడికొండ)మే 16(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికను రైతులు సద్వినియోగించుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. లాంఫాంలోని ఆచార్య వర్సిటీలో మూడు రోజుల పాటు జరిగిన అటారి జోన్ టెన్ యాన్యువల్ వర్క్‌షాప్, యాక్షన్ ప్లాన్ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం పెరగాలన్నారు. ఏఐ ఆధారిత వెర్టిగేషన్, ఇరిగేషన్, అంతర కృషి సాగు చేపట్టాలని సూచించారు. బయోస్టిమ్యూలెంట్స్, హర్మోన్స్ వినియోగం, అగ్రి-హార్టి-టూరిజమ్, టమోటలు, వంకాయ మొక్కల వినియోగం పెరగాలన్నారు. పెరుగుతున్న జనాభిని అంచనావేస్తే తగిన ఆహార పంటలను పండిస్తు ప్రణాళికలు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో అటారి డైరెక్టర్ డాక్టర్ ఎస్.ఎన్ మీరా, ఏపీఎస్ఎస్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ సతీష్, ఉద్యాన, పశుసంవర్ధక విశ్వవిద్యాలయ అధికారులు, విస్తరణ సంచాలకులు డాక్టర్ శివనారాయణ, డాక్టర్ గోవిందరాజు, డాక్టర్ శోభామణి, కేవీకే, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


భవనం నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ తేజ

భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

- పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ

గుంటూరు సిటీ, మే16(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనాల త్వరితగతిన పూర్తిచేయాలని పంచాయతీరాజ్ కమిషనర్ ఎం.వెంకటరామకృష్ణ తేజ ఆదేశించారు. శుక్రవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవనాన్ని ఆయన గుంటూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినాతో కలిసి పరిశీలించారు. జరుగుతున్న పనుల పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని నూతనంగా ఏర్పాటు చేసిన డీఎల్‌డీఓ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బస్సు, ఉప ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వెంకటకృష్ణ, ఆర్‌డబ్ల్యూ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, డీఈ శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీడబ్ల్యూఎంఏ పీడీ శంకర్, డీపీఓ సాయికుమార్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

మోడల్ జూనియర్ కాలేజీకి 22లోగా దరఖాస్తు చేసుకోవాలి

దాచేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ప్రిన్సిపాల్ తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, ఎటువంటి పొడిగింపులు ఉండవని తెలిపారు.

విద్యుత్ చౌర్యం నేరం

● విజిలెన్స్ దాడులలో 66 కేసులు నమోదు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

పిడుగురాళ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి విద్యుత్ సంస్థకు సహకరించాలని, విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్‌శాఖ మాచర్ల డివిజన్ ఈఈ ఎన్ సింగయ్య తెలిపారు. శుక్రవారం పిడుగురాళ్ల పట్టణ, మండలంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మొత్తం 66 కేసులు నమోదు కాగా రూ.2లక్షల 94వేల అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఈఈ సింగయ్య మాట్లాడుతూ అనధికార లోడు క్రమబద్ధీకరణ కింద గృహవిద్యుత్ వినియోగదారులు 50 శాతం సబ్సిడీతో క్రమబద్ధీకరించుకోవచ్చని చెప్పారు. ఒక కిలోవాట్‌కు ప్రస్తుతం 2వేలు చార్జి చెల్లించాల్సివుండగా ఈ పథకంలో భాగంగా రూ.వెయ్యి చెల్లించి క్రమబద్ధీకరించుకోవచ్చన్నారు. ఈ అవకాశం జూన్ 30వరకు మాత్రమే వుంటుందని సూచించారు. దాడులలో విజిలెన్స్ అధికారులు సీహెచ్ వెంకటేశ్వరరావు, ఈఈ ఎన్ఎం ప్రసాద్, డీఈఈ కె.రవికుమార్, ఎం సతీష్‌కుమార్, యు.శివశంకర్, కె.కోటేశ్వరరావు, ఏడీఈ నాగ సురేష్‌బాబు, ఏఈ లక్ష్మానాయక్ పాల్గొన్నారు.

శీనయ్యా.. నీ చొరవతో సమస్య తీరింది

● ఎమ్మెల్యే యరపతినేనికి సైదమ్మ కృతజ్ఞతలు



చినఅగ్రహారంలో సైదమ్మతో మాట్లాడుతున్న సీఐ వెంకట్రావు

పిడుగురాళ్ల, మే 16(ఆంధ్రజ్యోతి): చినఅగ్రహారానికి చెందిన కొమ్మనబోయిన సైదమ్మ తన సమస్య చెప్పుకునేందుకు గురువారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్దకు వచ్చింది. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సైదమ్మను గమనించి ఆమె సమస్యను ఆలకించి వివరాలు రాసుకున్నారు. ఆ తరువాత ఎమ్మెల్యే యరపతినేని పోలీసు, పంచాయతీరాజ్ అధికారులకు విషయాన్ని చెప్పి పరిష్కరించాలని కోరారు. శుక్రవారం పట్టణ సీఐ వెంకట్రావు చినఅగ్రహారం వెళ్లి సైదమ్మ కుమారుడు శ్రీనివాసరావుకు కౌన్సెలింగ్ ఇచ్చి సైదమ్మ వుండే గదికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి సమస్య పరిష్కరించారు. సైదమ్మ ఎమ్మెల్యే యరపతినేనితో ఫోన్‌లో మాట్లాడుతూ శీనయ్యా నా సమస్య తీరిందయ్యా అంటూ ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు చెప్పింది.

రేపు క్రోసూరులో మినీ మహానాడు

క్రోసూరు, మే 16(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో క్రోసూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డులో 18వ తేదీన సాయంత్రం 5 గంటలకు మినీ మహానాడు జరుగుతుందని క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి వేలాదిగా టీడీపీ కార్యకర్తలు, నాయకులు కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు దుద్దుల యోహాన్ మినీ మహానాడు విజయవంతం చేయాలని కోరారు.

భూసమీకరణపై నేడు గ్రామసభలు

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతికి భూసమీకరణలో భాగంగా అమరావతి మండల పరిధిలోని నాలుగు గ్రామాలలో రైతుల అభిప్రాయాలను సేకరించేందుకు స్థానిక ఎంఎల్ఏ భాష్యం ప్రవీణ్ అధ్యక్షతన శనివారం గ్రామసభలు జరుగుతాయని తహసీల్దార్ డానియేలు తెలిపారు. ముందుగా ఉంగుటూరు గ్రామంలో ఉదయం పది గంటలకు, 11గంటలకు నరుకుళ్లపాడు, సాయంత్రం 4.30గంటలకు నెమలికల్లు, 5.30 గంటలకు మండేపూడిలో గ్రామసభలు నిర్వహించనున్నారు. 18వ తేదీ బలుసుపాడు, కంభంపాడు గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు.

నడికూడి యార్డులో 4,900 టిక్కీల అమ్మకం

దాచేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం 5,400 మిర్చిటిక్కీలు రాగా 4,900 టిక్కీల అమ్మకం జరిగాయి. 334 రకం రూ 1800 నుంచి రూ 12,500, తేజారకం రూ 9వేలు నుంచి రూ 14 వేలు, తాలు గాయలు రూ 2వేలు నుంచి రూ 7వేలు వరకు అమ్మకాలు జరిగాయి.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

సత్తెనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం జరిగింది. రెంటపాళ్ళకు చెందిన పెద పిచ్చయ్య బస్టాండ్ వద్ద ఉండగా సత్తెనపల్లి నుంచి గుంటూరు వెళ్ళే హయ్యర్ ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వెళ్ళే సమయంలో పిచ్చయ్యను ఢీకొంది. దీంతో పిచ్చయ్య కాళ్ళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో పిచ్చయ్యను ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం గుంటూరు తరలించారు. పిచ్చయ్య ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పదిమందిపై హత్యాయత్నం కేసు

సత్తెనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): పదిమందిపై హత్యాయత్నం కేసు నమోదైంది. పట్టణంలోని అమరావతి పాఠశాల నిర్వాహకుడు సూర్యదేవర శ్రీనివాసరావుపై ప్రగతి విద్యాసంస్థల అధినేత మక్కెన అచ్చయ్య, మరో తొమ్మిది మంది శుక్రవారం పాఠశాలలో ఉన్న సమయంలో మారణాయుధాలతో వచ్చి చంపుతామని బెదిరించి దుర్భాషలాడారు. ఈ సంఘటనపై శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు అచ్చయ్య, మరో తొమ్మిదిమందిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు. అచ్చయ్య, మరో తొమ్మిదిమందిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్టు తెలిపారు. అమరావతి పాఠశాల విషయంలో సూర్యదేవర శ్రీనివాసరావుకు, మక్కెన అచ్చయ్యకు మధ్య కొంత కాలంగా వివాదం నడుస్తున్నది.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

క్రోసూరు, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరుకు చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు గాలి అమరయ్య(56) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. దొడ్లేరులోని ఎంపీపీ పాఠశాలలో ఆయన ఎస్‌జీటీగా పని చేస్తున్నారు. ఎంఈవో ఏకుల ప్రసాదరావు, ఎంఈవో-2 గణేష్, పలువురు ఉపాధ్యాయులు అమరయ్య భౌతిక కాయం పై పూలదండలు వేసి నివాళులర్పించారు.

అగ్రి ల్యాబ్‌పై అవగాహనేదీ..?

● విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలకు వినియోగించుకోని రైతులు
● ప్రారంభించి నాలుగేళ్లైనా వందల్లోనే పరీక్షలు
● పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలూ అందుబాటులో..





క్రోసూరులోని అగ్రి ల్యాబ్, ప్రయోగశాలలోని అధునాత పరికరాలు

క్రోసూరు, మే 16(ఆంధ్రజ్యోతి): క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో నాలుగేళ్ల క్రితం ప్రారంభించిన వ్యవసాయ ప్రయోగశాల(అగ్రిల్యాబ్)పై రైతుల్లో అవగాహన కొరవడింది. 2021లో ప్రారంభించిన ప్రయోగశాలలో ఇప్పటివరకు వందల సంఖ్యలో మాత్రమే ప్రయోగాలు జరిగాయి. ఐదు మండలాల్లో సుమారు 60 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. విత్తనాలు, ఎరువులకు ఇక్కడ నాణ్యత పరీక్షలు నిర్వహిస్తారు. ఇప్పటి వరకు 690 విత్తన నమూనాలు, 408 ఎరువుల నమూనా పరీక్షలు మాత్రమే ఇక్కడ జరిగాయి. ఆయా పరీక్షలు రైతులకు ఉచితంగా చేస్తారు. ఏడు నుంచి పది రోజుల్లో ఫలితాలను రైతులకు అందజేస్తారు. ప్రతి ఏటా ఐదు మండలాల్లోని ఏదో ఒక ప్రాంతంలో నాణ్యత లేని ఎరువులు, పురుగు మందుల బారిన పడి రైతులు నష్ట పోతున్నారు. ముందుగానే విత్తనాలు, ఎరువుల నాణ్యత పరీక్షలు చేయించుకుంటే నష్టం నుంచి బయటపడటమే కాక వాటిని విక్రయించిన వారిపై ఫిర్యాదు చేయటానికి కూడా రైతులకు అవకాశం ఉంటుంది. విత్తనాలు, ఎరువులు అమ్మే డీలర్లకైతే విత్తన పరీక్షకు రూ.250, ఎరువుల పరీక్షకు రూ.వెయ్యి ఫీజుగా నిర్ణయించారు. ఇంకా పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రతి సంవత్సరం 3200 వరకు పరీక్షలు చేయటానికి లక్ష్యంగా ఉంది. పశు వ్యాధుల నిర్ధారణకు ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉన్నప్పటికీ విత్తనాలు, ఎరువుల పరీక్షలకు మాత్రం పూర్తి స్థాయి సిబ్బంది నియామకాలు జరగలేదు. ఒక వ్యవసాయ విస్తరణ అధికారి ఎరువులను, మరొకరు విత్తనాలను పరీక్షిస్తున్నారు. ప్రయోగశాలకు శావల్యాపురం మండల వ్యవసాయ అధికారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రయోగశాల గురించి మరింత ప్రచారం కల్పిస్తే రైతులు నష్టాలబారిన పడకుండా కాపాడే అవకాశం ఉంటుంది. అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

పరిసరాల పరిశుభ్రతతో డెంగీ నివారణ

● జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహనా ర్యాలీలు



మాచర్ల: మాట్లాడుతున్న డాక్టర్ కేపీ చారి



దాచేపల్లి: అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మాచర్లటౌన్, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గృహాల్లోని నీటి నిల్వలను శుభ్రపరుచుకోవాలని, తద్వారా డెంగీని అరికట్టవచ్చని డాక్టర్ కేపీ చారి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేపీ చారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దోమ తెరలను వినియోగించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. అనంతరం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలో ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు డి.లక్ష్మయ్య, సీహెచ్ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దాచేపల్లిలో..

దాచేపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): డెంగీ నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని దాచేపల్లి ప్రాథమిక వైద్యశాల డాక్టర్ మధు వివరించారు. దాచేపల్లి పీహెచ్‌సీలో అవగాహన సమావేశం, ర్యాలీ నిర్వహించారు. డెంగీ అనుమాన జ్వర లక్షణాలతో బాధపడుతుంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలపాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రాజుపాలెంలో..

రాజుపాలెం, మే 16(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత దోమల ఉత్పత్తి నివారణకు ఎంతో ముఖ్యమని వైద్యుడు పౌలు రవి తెలిపారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది గ్రామంలో డెంగీపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ డెంగీని నివారించాలంటే నీటినిల్వలపై మూతలు ఉంచాలని, దోమల ఉత్పత్తిని నివారించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముప్పాళ్లలో...

ముప్పాళ్ల, మే 16(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతో డెంగీని నివారించవచ్చని డాక్టర్ జయకృష్ణ అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయకృష్ణ మాట్లాడుతూ ఇంటిచుట్టూ మురుగు నీటినిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పగటిపూట కుట్టే దోమలతోనే డెంగీ ప్రమాదం ఉందన్నారు. నిలిచి ఉన్న నీటిపై మడ్డి ఆయిల్ వంటి వాటిని పోయాలని తద్వారా దోమలు వృద్ధి చెందవని తెలిపారు.

బెల్లంకొండలో..

బెల్లంకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు నజీర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు, అన్ని గ్రామాల్లో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపక్కల నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, సీహెచ్‌వో మణికుమారి, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.



బెల్లంకొండ: ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సీఐ భాస్కర్



ఆలయాల కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ భాస్కర్

గురజాలటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): దేవాలయాలు, మసీదులు, చర్చిలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ భాస్కర్ కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ భాస్కర్ ఆయా కమిటీల వారితో సమావేశమయ్యారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ఆలయాల్లో కమిటీలతో మాట్లాడుకొని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలతో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూసుకోవచ్చన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా పెట్టాలి

అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిఘా పెట్టాలని సీఐ భాస్కర్ మహిళా పోలీసులకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీస్‌స్టేషన్లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు వినోద్‌కుమార్, అనంతకృష్ణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

క్రోసూరు ఎంపీడీవోగా రవికుమార్ బాధ్యతలు స్వీకారం

క్రోసూరు, మే 16(ఆంధ్రజ్యోతి): క్రోసూరు ఎంపీడీవోగా జీ రవికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రత్తిపాడు నుంచి పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. క్రోసూరు ఎంపీడీవోగా ఉన్న బిక్కి మహేష్ బాబు పదవీ విరమణ చేయగా ఇప్పటి వరకు ఈవోపీఆర్‌డీ ఈ శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌ను కార్యాలయ సిబ్బంది సత్కరించారు.

రాయితీ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి

రెంటచింతల, మే 16 (ఆంధ్రజ్యోతి): పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు కావాల్సిన వారు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో బోయపాటి బ్రహ్మారెడ్డి కోరారు. జీలుగ క్వింటా రూ.12,300 సబ్సిడీ పోను రైతులు చెల్లించాల్సింది రూ.6,150, జనుము క్వింటా రూ.10,900 సబ్సిడీ పోను రూ.5,450, పిల్లిపెసర క్వింటా రూ.18 వేలు సబ్సిడీ పోను రూ.9వేలని తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలన్నారు.

పేదలకు అన్నదానం

మాచర్ల రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్ దేశవరపు క్యాంపు తండాలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో టీడీపీ నేత పాత్లావత్ రాంచంద్ నాయక్ ఆధ్వర్యాన శుక్రవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. ముందుగా అర్చకుడు బ్రహ్మశ్రీ రామానుజదాస ఆధ్వర్యాన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, వజ్రం నాయక్, ఆడెపు కోటయ్య, ఆర్టీసీ బాలు, హతీరాం నాయక్, రాములు, శ్రీను, గుణదలా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్, రావుల శ్రీను, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

గేదెల దొంగ అరెస్టు

రెంటచింతల, మే 16 (ఆంధ్రజ్యోతి): గత నెల 28న మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన కె.సంసోన్‌తో పాటు మరికొంత మందికి చెందిన పాడి గేదెలను అపహరించిన వ్యక్తి కుంచపు దుర్గా ప్రసాదరావును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున చెప్పారు. 22 గేదెలను దొంగిలించగా అందులో 6 గేదెలను దుర్గి మండలం అడిగొప్పులలో స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దుర్గా ప్రసాదరావు పిడుగురాళ్లకు చెందిన వ్యక్తి.

రేపు చట్టాలపై అవగాహన సదస్సు

మాచర్ల రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో గల మాతాసరోవర్‌లో ఈనెల 18వ తేదీన ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు టీడీపీ ఎస్టీ సెల్ మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు కరపత్రాలను శుక్రవారం విడుదల చేసి మాట్లాడారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్, ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యాన జరగబోయే ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాణావత్ వెంకటేష్ నాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.

31 లోపు కౌలు రైతు కార్డు పొందాలి

దుర్గి, మే 16 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతు కార్డులు పొందుటకు ఈనెల 31 చివరి తేదీ అని ఏవో అమ్మిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కౌలురైతు కార్డు కావాల్సిన వారు వీఆర్వోను గాని రైతు భరోసా కేంద్రంలో గానీ సంప్రదించాలన్నారు. మండలంలో పొలం కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్న ప్రతి కౌలు రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ

కిశోర వికాసం కార్యక్రమంలో సీడీపీవో సరళ

బెల్లంకొండ, మే 16(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని క్రోసూరు ప్రాజెక్టు సీడీపీవో సరళ పేర్కొన్నారు. శుక్రవారం బెల్లంకొండ మండలంలోని కందిపాడు గ్రామంలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా కౌమార దశలో బాలికలు మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. వేరుశనగ, చిక్కీలు, ఫ్రూట్స్, ఆకుకూరలు, గుడ్లు తీసుకుంటే రక్త హీనత బారిన పడకుండా ఉంటారని బాలికలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వనజ, మహిళా పోలీసు నందిని, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు ఆకుకూరలు, చిరు ధాన్యాలు, శనగ విత్తనాలు తినటం వల్ల రక్తహీనతను తగ్గించుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం అన్నారు. శుక్రవారం పుట్లగూడెంలో కిశోర వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ ఆహారం లో ఆకుకూరలతో పాటు కరివేపాకు కూడా ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే ఎల్ లిల్లి, ఏఎన్ఎం ఏఆర్ రోజారాణి, అంగన్‌వాడీ, ఆశా, వీవో కార్యకర్తలు పాల్గొన్నారు.



అచ్చంపేట: పుట్లగూడెంలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం

పెదకూరపాడులో..

పెదకూరపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు రక్తహీనతపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని అవగాహన కల్పించారు. మండలంలోని పాటిబండ్లలో గ్రామ కిశోర వికాసం సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్రవారం కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త శాంతకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు మాచర్లలో తిరంగా యాత్ర

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పేరుతో మన దేశ సైన్య శౌర్య పరాక్రమాలను ఘనంగా చాటేందుకు శౌర్య తిరంగా యాత్రను మాచర్ల పట్టణంలో ఆదివారం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం 5 గంటలకు పట్టణంలోని రింగురోడ్డు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు యాత్ర సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భారత సైన్యానికి కృతజ్ఞతలు తెలపడంతో పాటు వీరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటించేందుకు తిరంగా యాత్రకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారన్నారు. ఈ యాత్రలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలన్నీ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సీఎం దృష్టికి సత్రశాల ప్రాశస్త్యం



సీఎం చంద్రబాబుకు వినతిని అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

రెంటచింతల, మే 16 (ఆంధ్రజ్యోతి): పల్నాట ఏకైక శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాల పుణ్యక్షేత్రం అభివృద్ధి, ఆ ఆలయం ప్రాశస్త్యాన్ని గురించి సీఎం చంద్రబాబునాయుడుకు వివరించామని.. పునర్నిర్మాణ పనులకు నిధులు కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ వినతిని అందచేసినట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ 11వ శతాబ్దంలో నిర్మితమైన ఈ ఆలయం 4 ఎకరాల 80 సెంట్లలో ఈ వుందని, ఆలయ ప్రాంగణంలో 1.86 సెంట్లలో 11 రకాల ఉపాలయాలున్నాయని వీటన్నింటిని ఒకే వరుస క్రమంలో నిర్మించాలనేది స్థపతుల ఆలోచనగా ఉందన్నారు. మాడవీధులు మూడు వైపుల మాత్రమే వున్నాయని మరో వైపు ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. అందుకు చిన్న ఆలయాలను తొలగించాల్సి ఉందన్నారు. కృష్ణానది అందుబాటులో ఉండడం వలన టూరిజమ్ కేంద్రంగా తీర్చిదిద్దాల్సి ఉందన్నారు. పాత మెట్లు, పుష్కర మెట్ల మధ్య చిట్టడవిని సుందరీకరణ చేయాల్సిన ఆవశ్యకతను సీఎంకు వివరించామన్నారు. ప్రభుత్వ చేయూతతో పాటు దాతలు సహకరిస్తే ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేయొచ్చన్నారు. జంక్షన్ నుంచి సత్రశాల వరకు రోడ్డు విస్తరణకు రూ.21.60 కోట్లు విడుదలయ్యాయని, టెండర్ల ప్రక్రియ పూర్తైతే పనులు ప్రారంభమవుతాయన్నారు.

వైభవంగా బొడ్డురాయి ప్రతిష్ఠా మహోత్సవం

మాచవరం, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగడ్డ గ్రామంలో నూతనంగా బొడ్డురాయి ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం జరిగింది. పులిచింతల ప్రాజెక్టు నిర్మాణం వల్ల రేగులగడ్డ గ్రామం పూర్తిగా ముంపు జాబితాలోకి తీసుకున్నారు. దీంతో గ్రామస్తులందరూ కలసి పాత గ్రామానికి పై పక్కన ఇళ్ళ స్థలాలు కొనుగోలు చేసుకొని నూతన రేగులగడ్డ గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. గ్రామస్తులందరూ కలసి నూతన బొడ్డురాయి, ఆంజనేయ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించుకున్నారు. పొంగళ్ళు పొంగించి ఊరేగింపుగా బొడ్డురాయి వద్దకు వెళ్ళి మొక్కుబడులు తీర్చుకున్నారు. వేద పండితుల వేద మంత్రాలతో గ్రామం మారుమోగింది. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అనుమానాస్పద స్థితిలో వాటర్ ప్లాంట్ దహనం

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని కళాంజలి షోరూం సమీపంలోని శశిరేఖకు చెందిన వాటర్‌ప్లాంట్ గురువారం రాత్రి 2గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా సామాగ్రి దగ్ధమైంది. ప్లాంట్ నుండి పొగలు రావడం గమనించిన స్థానికులు శశిరేఖకు సమాచారం ఇవ్వగా ఆమె వచ్చి ప్లాంట్‌షట్టర్‌ను తెరిపించగా మంటలు వ్యాపించివున్నాయి. మంటలను ఆర్పివేశారు. అయితే ప్లాంట్ షట్టర్ వద్ద లైటర్, తగలబడుతున్న పెట్రోల్ బాటిల్, చేతి గ్లౌజ్‌లను గమనించిన శశిరేఖ, ఎవరో ప్లాంట్‌లో పెట్రోల్ పోసి నిప్పంటించి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ప్రమాదంలో సుమారు రూ.6లక్షల విలువైన ఆస్తినష్టం జరిగింది.

సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవు

● ఎస్ఐ సుధీర్‌కుమార్

దుర్గి, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతమైన పల్లెల్లో సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సుధీర్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని ఆత్మకూరు ఎస్సీ కాలనీలో శుక్రవారం మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వాహనాలను తనిఖీ చేశారు. గృహాలను సోదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఎటువంటి అలజడులు సృష్టించకుండా అందరూ కలిసి మెలిసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 16 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 512.70 అడుగులు ఉంది. ఇది 136.30 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 450, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 450 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పులిచింతల...

అచ్చంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శుక్రవారం 22.56 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

● 15 గంటలకు పైగా విద్యుత్ కోత
● ఇబ్బందులు పడ్డ ప్రజలు

పెదకూరపాడు, మే 16(ఆంధ్రజ్యోతి): గురువారం అర్ధరాత్రి తరువాత ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలైనా విద్యుత్ సరఫరా లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ప్రభుత్వకార్యాలయాల్లోనూ కంప్యూటర్లు పని చేయలేదు. 16 గంటలకు పైగా విద్యుత్ లేకపోవటంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.

మండెపూడిలో పిడుగుపాటుకు పూరిల్లు దగ్ధం

అమరావతి, మే 16(ఆంధ్రజ్యోతి): గురువారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షానికి మండలంలోని మండెపూడి గ్రామంలో ఓ ఇంటిపై పిడుగు పడి ఇల్లు పూర్తిగా బూడిదైంది. గ్రామానికి చెందిన సఫావత్ సాంబయ్య నాయక్ కుటుంబ సభ్యులు ఇంటిలో నిద్రిస్తుండగా పిడుగుపడింది. దీంతో ఇంటిలోని వారికి ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఇల్లు పూర్తిగా దెబ్బతింది.

సత్తెనపల్లిలో భారీ వర్షం

సత్తెనపల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రెండు గంటలకు పైగా కురిసింది. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఉదయం 9 గంటల వరకు కూడా వర్షపు జల్లులు కురుస్తానే ఉన్నాయి. వర్షపు జల్లుల్లోనే పారిశుధ్య కార్మికులు తమ విధులు నిర్వహించారు. కొద్ది రోజులుగా ఎండ వేడిమితో ఇబ్బంది పడుతున్న ప్రజలు వాతావరణం చల్లబడటంతో సేద తీరారు.

పల్నాడులో మోస్తరు...

పిడుగురాళ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఉరుములు మెరుపులతో మోస్తరు వర్షం కురిసింది. అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి ఉదయం 8 గంటల వరకు జల్లులతో వర్షం పడటంతో వాతావరణం చల్లబడింది. దీంతో శుక్రవారం రోడ్లపై జనసంచారం కనిపించింది.

మత్స్య కేంద్రం



లక్ష్యం నెరవేరని.. మత్స్యకేంద్రం!

● విజయపురిసౌత్‌లో నామమాత్రంగా చేప పిల్లల ఉత్పత్తి

● జీవనోపాధి కోల్పోతున్న మత్స్యకారులు

మాచర్ల టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): మత్స్య సంపదను అభివృద్ధి చేసి, మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ప్రభుత్వ లక్ష్యం నాగార్జున సాగర్ (విజయపురిసౌత్)లో నెరవేరడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాగార్జున సాగర్ మత్స్యకేంద్రం అభివృద్ధికి మత్స్యశాఖ నుంచి రూ. 1.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి.అయితే.. వైసీపీ నేతలు కమీషన్ల కోసం మత్స్యకేంద్రం అభివృద్ధి ముందుకు సాగకుండా అడ్డుతగిలారు. దీంతో అభివృద్ధి నిలిచిపోయింది. నాగార్జున సాగర్ విజయపురిసౌత్‌లో మత్స్య కేంద్రంను సుమారు 32 ఎకరాలలో 1957లో ఏర్పాటు చేశారు. 150 టన్నుల వరకు చేపలను నిల్వ చేయడానికి శీతల గిడ్డంగిని నిర్మించారు. స్పాన్ ద్వారా చేప పిల్లలను ఉత్పత్తి చేయడానికి 26 సిమెంట్ తొట్టెలు, అందులో చేపలను పెంచడానికి 30 మట్టి తొట్టెలు నిర్మించారు. సుమారు 80 లక్షల నుంచి కోటి వరకు చేప పిల్లలను పెంచడానికి కావాల్సిన అన్ని వసతులు ఇక్కడ ఉన్నాయి. మత్స్యశాఖాధికారులు సిబ్బంది నివసించడానికి పక్కా గృహాలు ఏర్పాటు చేశారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఇక్కడే ఉంది. జలాశయంపై ఆధారపడి 650 కుటుంబాల మత్స్యకారులు నివసిస్తూ.. రోజుకు 150 టన్నుల వరకు చేపలను పట్టేవారు. వీటిని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు. ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది సిబ్బందిని ప్రభుత్వం బదిలీపై పంపింది. 1996లో అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాన్ని జిల్లా కేంద్రానికి మార్చారు. ఆ తరువాత మరికొంత మంది సిబ్బందిని కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్ వంటి ప్రదేశాలకు బదిలీ చేశారు. క్రమేణా ప్రయోగశాల మూతపడింది. ఐస్ ఫ్యాక్టరీని నిరుపయోగంగా మార్చారు. సుమారు పదేళ్లపాటు మూసివేశారు.

తిరిగి ప్రారంభమై..

అనంతరం మత్స్యకేంద్రం ప్రారంభమైంది. ప్రస్తుతం మత్స్య కేంద్రంలో ఒక అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు ఫీల్డ్ మెన్‌లు, ఒక ఫిషర్‌మెన్ విధులు నిర్వహిస్తున్నారు. 12 తొట్లలో చేప పిల్లలను పెంచుతున్నారు. ఇక్కడ ఏటా 4 లక్షల చేప పిల్లలను పెంచి, సాగర్ జలాశయంలో విడుదల చేస్తున్నారు. చేప సీడ్‌ను కూచిపూడి, కైకలూరు ప్రాంతాల నుంచి తీసుకొస్తున్నారు. నాగార్జున సాగర్ దిగువ కృష్ణానది అతి సమీపంలో ఉన్నప్పటికీ మోటారు బోరు నీటిపైనే మత్స్య సంపద పెంచుతున్నారు. తరచూ నీటి తొట్లు, మోటార్లు రిపేర్లు అవుతున్నా మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చూపుతున్నారు. చేపపిల్ల పెంపక కేంద్రం ఆవరణ మొత్తం చిట్టడవిని తలపించేలా ఉండడం పరిశీలిస్తే నిర్వహణ ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుంది. సుమారు 30 ఎకరాల ఈ మత్స్యకేంద్రంలో చేప పిల్లల పెంపకంతోపాటుగా.. చేపల చెరువును ఏర్పాటు చేసి స్థానిక మత్స్యకారుల సంఘానికి లీజుకు ఇవ్వాలని మత్స్యకారుల సంఘం నాయకులు పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నా ఆచరణకు నోచుకోలేదు.

నాడు చేతులు దులుపుకుని..

నాగార్జున సాగర్ జలాశయంలో ప్రతి ఏటా కోటి 50 లక్షల వరకు చేప పిల్లలను విడుదల చేస్తే మత్స్యకారుల జీవనానికి దోహదపడుతుంది. కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో అరకొరగా చేప పిల్లలను విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. కూటమి ప్రభుత్వంలో గత 11 నెలల్లో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యాన 30 లక్షల చేప పిల్లలను సాగర్ జలాశయంలో విడుదల చేశారు. స్థానిక మత్స్యకేంద్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తే చేప పిల్లల పెంపుదల గణనీయంగా పెరుగుతుంది.



చేప పిల్లలను పెంచే సిమెంట్ తొట్టెలు



ముళ్ల కంపతో కుచించుకుపోయిన మత్స్య కేంద్రం

ప్రభుత్వం ప్రోత్సాహం అందించాలి



ఇక్కడ 650 మత్స్యకార కుటుంబాలు చేపల వేటపైనే జీవనం సాగిస్తున్నాయి. ఏటా చేప పిల్లలను విడుదల చేసున్నారు. కానీ, అలు (జీరోసైజు) వలలతో చేపల వేట చేయడంతో మత్స్య సంపద హరించుకుపోతోంది. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సముద్ర ప్రాంతంలో జాలర్లకు ఇచ్చినట్లు మాకూ ప్రోత్సాహం ప్రభుత్వం ఇవ్వాలి.

- మైలపల్లి అప్పలరాజు, మత్స్యకారుడు

మత్స్య సంపద పెంచేలా కృషి చేయాలి



నాగార్జున సాగర్ మత్స్య కేంద్రంలో మత్స్య సంపదను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. మత్స్య కేంద్రంలో చేపల చెరువును ఏర్పాటు చేసి మత్సకారుల సంఘానికి లీజుకు ఇవ్వాలి. ఏటా సాగర్ జలాశయంలో 1.50 కోట్ల చేప పిల్లలను విడుదల చేయాలి. మత్స్యకారులకు వలలు, రుణాలు, మోటారు సైకిళ్ల ప్రభుత్వం మంజూరు చేయాలి.

- ఎరిపల్లి వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు, మత్స్యకారుల సంఘం

ఆర్టీసీలో..

● త్వరలో ఆర్టీసీ ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్

● నేరుగా కండక్టర్ వద్దే బుక్ చేసుకోవచ్చు..

కొరియర్ సేవలు సులభతరం



గుంటూరు, మే 16(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ త్వరలో ఇన్ బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌ను ప్రారంభించనుంది. ఇప్పటి వరకు ఆర్టీసీ కార్గో పార్శిల్ బుకింగ్ కేంద్రంలోనే ఈ సదుపాయం ఉంది. ఇకపై బస్‌లో కండక్టర్ వద్దనే పార్శిల్ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఆర్టీసీ యంత్రాంగం ఇన్‌బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌పై ప్రచారం చేస్తోంది. త్వరలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆర్టీసీలో వస్తువులు, కొరియర్‌లకు బస్టాండ్ ఆవరణతో పాటు ఆర్టీసీ ఆథరైజ్డ్ డీలర్స్ వద్ద మాత్రమే బుకింగ్ సదుపాయం ఉంది. ఇక అలా కాకుండా విలువైన పత్రాలైనా, ఏవైనా వస్తువులను బస్సును ఆపి కండక్టర్ వద్దే పార్శిల్ బుకింగ్ చేసుకొని, గమ్య స్థానాలకు చేర్చుకోవచ్చు. 250 గ్రాముల లోపు నుంచి 5 కేజీల వరకు బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. కొరియర్ 250 గ్రాముల వరకు డెలివరీ చార్జి రూ. 80, ఆపై 5 కేజీల వరకు రూ.140లుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. బుకింగ్ సమయంలో బుకింగ్ చేసేవారి, గమ్య స్థానంలో పార్శిల్ తీసుకునే వారి ఫోన్ నంబర్లను ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం తగిన రశీలు పొందవచ్చు. కొరియర్‌లో వస్తువులు నమ్మకంగా గమ్యస్థానాలకు చేరుతాయని అధికారులు భరోసా ఇస్తున్నారు. ఇన్ బస్ పార్శిల్ బుకింగ్ సర్వీస్‌పై ఆర్టీసీ యంత్రాంగం ప్రచారానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే బస్సుల్లో ప్రచారం ప్రారంభించింది. ప్రజలు ఆర్టీసీ ప్రవేశపెట్టిన కొత్త పార్శిల్ సర్వీసును సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పిస్తోంది.

తెలుగు రాష్ట్రాల స్థాయి

నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డాక్టర్ జయమ్మ

చిలకలూరిపేట, మే16 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట సీఆర్ క్లబ్, చిలకలూరిపేట కళాపరిషత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే తెలుగు రాష్ట్రాల స్థాయి 9వ ఆహ్వాన నాటిక పోటీలు స్థానిక సీఆర్ క్లబ్ ఓపెన్ థియేటర్‌లో శుక్రవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కందిమళ్ల జయమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. తొలి రోజున జరిగిన కార్యక్రమంలో సీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, సీనియర్ కళాకారులు మల్లాది శివన్నారాయణ, కందిమళ్ల నారాయణమూర్తి, జరుగుల రామారావు, ఇంకా జమాల్ బాషా, డాక్టర్ ప్రత్తిపాటి ప్రఫుల్లాదేవి, గోరంట్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు, చిలకలూరిపేట మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్ వారి మా ఇంట్లో మహాభారతం, విజయవాడ మైత్రి కళానిలయం వారి బ్రహ్మ స్వరూపం నాటికలు ప్రదర్శించారు.

ఈ విగ్రహాల..

విలువెంతో..!

● కోర్టు ఆదేశాలతో కదిలిన పురావస్తుశాఖాధికారులు

● రైతు పొలంలో లభించిన విగ్రహాల పరిశీలన

● విలువ లెక్కగట్టే పనిలో రీజినల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్ బృందం



పొలంలో లభించిన విగ్రహాలు

పురావస్తు శాఖ రీజనల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్, సిబ్బంది

బాపట్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాలతో పురావస్తుశాఖాధికారులు తరలి వచ్చారు. రైతు పొలంలో లభించిన విగ్రహాలను ఎట్టకేలకు పరిశీలించారు. బాపట్ల జిల్లాలోని పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన రైతు ఎండీ అన్వర్ ఆలీ అన్సారి పొలం మరమ్మతులు చేస్తుండగా 2003లో విలువైన 4 విగ్రహాలు, పూజా సామగ్రి బయటపడ్డాయి. వీటిని సదరు రైతు చందోలు పోలీసులకు అప్పగించారు. పోలీసులు వాటిని అధికారుల పర్యవేక్షణలో బాపట్ల సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేశారు. అయితే, రైతు అన్వర్ ఆలీ అన్సారి విగ్రహాల విలువలో తనకు వాటా కావాలని 2014లో హైకోర్టును ఆశ్రయించారు. 2023లో విగ్రహాల విలువ లెక్కకట్టమని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినప్పటికి పురావస్తు శాఖాధికారులు పట్టించుకోలేదు. రైతు తరుపున హైకోర్టు న్యాయవాది కె.జోసఫ్ కోర్టు ధిక్కరణ కేసు వేశారు. దీంతో పురావస్తుశాఖాధికారులు స్పందించారు. బెంగళూరులోని దక్షిణ భారతదేశ పురావస్తుశాఖ రీజినల్ డైరెక్టర్ ఎన్‌కే పాఠక్ బృందం శుక్రవారం బాపట్ల తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి సబ్ ట్రెజరీ కార్యాలయంలో డిపాజిట్ చేసిన విగ్రహాలను తీసుకొచ్చి పరిశీలించారు. బరువు, విలువను లెక్క కట్టారు. నివేదికను కోర్టుకు సమర్పించనున్నట్లు తెలిసింది. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ పి. గ్లోరియా, బాపట్ల, పిట్టలవానిపాలెం తహసీల్దార్లు షేక్.సలీమా, డి. వెంకటేశ్వరరావు, దేవ దాయ, రెవెన్యూశాఖాధికారులు పాల్గొన్నారు.

లభించిన విగ్రహాలు

రైతు ఆలీ అన్సారీ పొలంలో శ్రీ విష్ణు, శ్రీమహా విష్ణు, శ్రీలక్ష్మీ, నటరాజస్వామి విగ్రహాలు బయటపడ్డాయి. వాటితోపాటు పూజా సామగ్రి ఇతర వస్తువులున్నాయి. ఈ విగ్రహాలు 14వ శతాబ్దానికి పూర్వానివిగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అయితే అధికారులు మాత్రం దీనిని ధ్రువీకరించేందుకు అంగీకరించలేదు.

వాటా కావాలి



విగ్రహాలు మా భూమిలో దొరికాయి. కాబట్టి వాటి విలువలో వాటా ఇవ్వాలి. గతంలో వాటి బరువు సుమారు 57 కిలోలు ఉంది. విలువలో 20 శాతం రైతుకు ఇవ్వాలని జీఓ ఉంది. కేరళలో ఇలా దొరికితే వాటి విలువ మొత్తం రైతుకే చెందుతుందని ఉంది. వీటికి సంబంధించిన జీవోలను కోర్టులో సమర్పించాం.

-ఎండీ అన్వర్ ఆలీ అన్సారీ, రైతు

నివేదిక మేరకు ప్రభుత్వం చర్యలు



హైకోర్టు ఆదేశాల మేరకు పురావస్తుశాఖాధికారులు బాపట్ల వచ్చి ట్రెజరీలో డిపాజిట్ చేసిన విగ్రహాలను పరిశీలించారు. వారు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తారు. దాని ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

- జి.గంగాధర్‌గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి

ఐదేళ్లు..5 ప్రభుత్వ ఉద్యోగాలు

ఆదర్శంగా నిలుస్తున్న మాజీ సైనికుడు



పొన్నూరుటౌన్, మే 16: భారత సైన్యంలో పదిహేడున్నర సంవత్సరాలు సేవలు అందించిన మాజీ సైనికుడు.. పదవీ విరమణ తర్వాత ఐదేళ్లలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి మన్ననలు అందు కుంటున్నాడు. బాపట్ల జిల్లా చందోలు గ్రామానికి చెందిన మహ మద్ గౌస్ కుటుంబం పొన్నూరు పట్టణంలోని ఇటికంపాడు రోడ్డులో స్థిరపడింది. సైన్యంపై మక్కువతో 2003లో 10వ తరగతి విద్యార్హతతో ఆర్మీలో చేరిన గౌస్ ఓ వైపు సిపాయిగా పని చేస్తూనే ఎంఏ ఎకనామిక్స్ మాస్టర్ ఆఫ్ లైబ్రరీ ఇన్‌ఫర్మేషన్ సైన్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యను పూర్తిచేశారు. హవాల్దార్‌గా, టీచర్ ట్రైనర్‌గా పలు విభాగాల్లో పని చేసిన గౌస్ 2020లో పదవి విరమణ చేశారు. అనంతరం పొన్నూరు వచ్చి.. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే స్టాఫ్ సెలక్షన్ పరీక్షలతో పాటు, వివిధ పరీక్షలు రాశారు. జనరల్ కేటగరిలో కోల్ ఇండియాలో షావల్ మిషన్ ఆపరేటర్‌గా తొలి ఉద్యోగాన్ని సాధించారు. అనంతరం ఇస్రో ఏ గ్రేడ్ వెహికల్ ఆపరేటర్‌గా, మరోసారి రాసిన పరీక్షలలో ఇస్రో లైట్ వెహికల్ ఆపరేటర్‌గా మొదటిసారి రాసిన పరీక్షల్లో జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ నిర్వహించిన పరీక్షలలో శాస్త్రవేత్తలకు డ్రైవర్‌గా ఎంపికయ్యారు. ఈ ఉద్యోగం చేస్తూనే జైళ్ల శాఖ నిర్వహించిన పరీక్షలకు హాజరైన గౌస్.. స్టాఫ్ డ్యూటీ ఉద్యోగానికి ఈ మే నెలలో ఎంపికయ్యారు. ప్రస్తుతం జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయంలో స్టాఫ్ డ్యూటీలో చేరారు. ఒక ప్రభుత్వ ఉద్యోగం రావాలంటేనే ఎంతో శ్రమకోర్చి సిద్ధం అవ్వాల్సిన ప్రస్తుత తరుణంలో.. జనరల్ క్యాటగిరిలో ఐదేళ్ల కాలంలో ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు గౌస్ సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది.

భూముల రీ సర్వేలో మన విధానం భేష్

● తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామన్న ప్రతినిధులు ● రెండు రోజుల జాతీయ కార్యశాల నిర్వహణతో గుంటూరుకు ఖ్యాతి

● కేంద్ర మంత్రి పెమ్మసాని, జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపిన ప్రభుత్వం

గుంటూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): భూముల సర్వే/రీసర్వే విధానం ఇక్కడ చాలా పకడ్బందీగా జరుగుతోందని, గ్రౌండ్ ట్రూతింగ్, భూమి రికార్డుల స్వచ్ఛీకరణ, డ్రోన్ ఫ్లయింగ్, జియో కో-ఆర్డినేట్స్, అధిక స్పష్టత కలిగిన శాటిలైట్ చిత్రాలు, గ్రీవియన్స్ స్వీకరణ, వాటి పరిష్కారానికి ఏర్పాటు చేసిన యంత్రాంగాలు చాలా భేషుగ్గా ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ భూమి రికార్డుల శాఖతో పాటు సర్వే ఆఫ్ ఇండియా, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు ప్రశంసించారు. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడరనైజేషన్ ప్రోగ్రాం కింద గుంటూరు నగరంలోని ఐటీసీ వెల్‌కం హోటల్‌లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ కార్యశాల శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా రీసర్వేలో మనం అవలంబిస్తున్న విధానాలను తెలుసుకొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు ఎంతో ఆసక్తి కనబరిచారు. తొలి రోజున వట్టిచెరుకూరులోని అనంతవరప్పాడులో జరిగిన ఫీల్డ్ విజిట్‌లోనూ అనేక అంశాలను తెలుసుకొన్నామని వారు చెప్పారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎంతో చొరవ తీసుకొని జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహణకు గుంటూరుని వేదికగా చేయడం ద్వారా ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చారని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ అధికారులు ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా తక్కువ వ్యవధిలో వర్క్‌షాప్ నిర్వహణకు సకల ఏర్పాట్లు చేసిన గుంటూరు జిల్లా యంత్రాంగాన్ని స్పెషల్ సీఎస్ జయలక్ష్మి అభినందించారు. అలానే కర్ణాటక, ఒడిస్సా, అస్సాం, లద్దాక్ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న రీసర్వే విధానం, అనుభవాలను పంచుకొన్నారు. అంతిమంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన డీఐఎల్ఆర్ఎంపీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రోత్సాహకాలు అందుకోవాలని అన్ని రాష్ట్రాల అధికారులు నిర్ణయించారు. చివరి రోజున మునిసిపల్ మంత్రి నారాయణ నక్షా కార్యక్రమంపై చేసిన ప్రసంగం అందరిని ఆకట్టుకుంది.



భూ రికార్డుల డిజిటలైజేషన్‌పై రెండు రోజుల కార్యశాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ సెక్రటరీ మనోజ్ జోషి ప్రసంగాన్ని అందరూ శ్రద్ధగా ఆలకించారు. నాణ్యమైన భూ రికార్డులు నిర్వహించే రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ దాదాపు రూ.1000 కోట్ల వరకు ప్రోత్సాహక నిధులను అందిస్తుందని ఆయన చెప్పారు. ఆర్వోఆర్‌లో 80 శాతంకు పైగా వ్యక్తిగత ఖాతాలు ఉంటే దానిని నాణ్యమైన భూ రికార్డులుగా గుర్తించడం జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో 90 శాతానికి పైగా డిజిటలైజ్డ్ చేసిన భూ ఖాతాలలో వ్యక్తిగత ఖాతాలు ఉండటంతో అత్యధికంగా ప్రోత్సాహక నిధులు అందుకోవటం జరిగిందని ఉదహరించారు. జాతీయ వర్క్ షాపు వలన రాష్ట్రాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే పై కేంద్ర ప్రభుత్వ భూవనరుల శాఖకు అవగాహన వచ్చిందన్నారు. అదే విధంగా రాష్ట్రాలకు ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న రీ సర్వే చేస్తున్న విధానం తెలుసుకునే అవకాశం కలిగిందన్నారు. మానవ వనరులను ప్రణాళిక ప్రకారం వినియోగించుకొని రీ సర్వేను నిర్దేశించిన లక్ష్యాల అధిగమించేలా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ కునాల్ సత్యార్థి కేంద్ర భూ వనరుల శాఖ సర్వే రీ సర్వే , నక్షా కార్యక్రమాలకు వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న నిధులు, ప్రోత్సాహకాలు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు భూముల రీ సర్వేకు సంబంధించి తెలిపిన అనేక సందేహాలకు కేంద్ర భూ వనరుల శాఖ అధికారులు నివృత్తి చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ తేజ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అమ్మో పిడుగు!



అప్రమత్తతోనే రక్షణ

● వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు ● జాగ్రత్తలు పాటించాలంటున్న నిపుణులు

సత్తెనపల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుకు పలు ప్రాంతాల్లో మనుషుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రస్తుతం చిన్నపాటి మేఘాలు కమ్మినా.. వాతావరణం భీకరంగా మారిపోతోంది. వెంటనే ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం అప్పుడప్పుడు పిడుగులు పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితికి వాతావరణంలోని మార్పులు ఒక కారణంగా కాగా.. మానవ తప్పిదం కూడా ఒక కారణమని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. భూ ఉపరితలం నుంచి ఎంత ఎత్తులో మేఘాల మధ్య ఘర్షణ నెలకొన్నా.. పిడుగులు తీవ్రత ఒకేలా ఉంటుందని, గాలి పీడనంలో వ్యత్యాసాలు, మేఘాల కదలికలపైన ఆధారపడి ఉంటాయన్నది వాతావరణ శాఖ నిపుణుల అభిప్రాయం. భూ ఉపరితలంలో 16 కిలో మీటర్ల నుంచి 13 కిలో మీటర్ల మధ్య మేఘాలు ఏర్పడతాయి. రెండు మేఘాల మధ్య ఘర్షణ నెలకొని అత్యధిక విద్యుతావేశం ఉద్భవిస్తుంది. ఆ సమయంలోనే ప్రశాంతమైన కాంతి, అధిక ధ్వని వెలువడతాయి. కాంతి వేగం ఎక్కువ కావడం వల్ల మొదట మెరుపు, తర్వాత ధ్వని వినిపిస్తుంది. మెరుపు ఎక్కువగా విస్తరిస్తే భూమిపై పిడుగు ప్రభావం తక్కువగా ఉంటుంది. మెరుపు ఒకే చోట మెరిసి శబ్దం చేస్తే దాని ప్రభావం భూ ఉపరితలం పై ఎక్కువగా ఉంటుంది. పిడుగు పడిన శబ్దం 24 కిలోమీటర్ల పరిధిలో అందరికీ వినిపిస్తుంది. ఆ సమయంలో 14 కిలో మీటర్ల పరిధిలో వర్షం కురిసే అవకాశం ఉంది. ఎత్తైన ప్రదేశాలు, చెట్లపై, తడిగా ఉన్న ప్రాంతాల్లో పిడుగులు పడతాయి. ఎలక్ట్రానిక్స్ విద్యుత్ పరికరాలను పిడుగులు వేగంగా ఆకర్షిస్తాయి. అందుకే వర్షంలో సెల్ ఫోన్ వాడకూడదు. వర్షంలో తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేస్తే మంచిది. మనం ప్రయాణించే సమయంలో ఎక్కడ పిడుగులు పడినా సెల్ ఫోన్‌లు ఆకర్షిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

ముందస్తు హెచ్చరిక కీలకం



భారీ వర్షాలు, పిడుగులకు సంబంధించిన సమాచారాన్ని వాతావరణ శాఖ మెసేజ్ రూపంలో తెలియజేస్తుంది. ఇలాంటి సమాచారాన్ని తేలిగ్గా తీసుకోకుండా ప్రజలు కచ్చితంగా సూచనలు పాటిస్తే మంచిది. వర్షం కురిసే సమయంలో తడిచి వెళ్లినా పర్వాలేదు, కాని తాటి, టేకు, కొబ్బరి తదితర చెట్ల కింద ఉండకూడదు. గొడుగు వేసుకుని వెళ్లడం ప్రమాదానికి సంకేతం. కార్లు, వాహనాల్లో ప్రయాణించే వారు ప్రయాణాన్ని ఆపివేస్తే మంచిది. వెళ్లాల్సి వస్తే కారు అద్దాలన్నింటినీ మూసి వేయాలి. రైతులు, పశువుల కాపర్లు, కూలీలు బహిరంగ ప్రదేశాల్లో పని చేసే వారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. ఇళ్లపై ఎత్తయిన ప్రదేశాల్లో మెటల్ రాడ్‌ను బిగించాలి. పిడుగు పడితే ఇది ఆకర్షించి ప్రమాదం జరిగే అవకాశం తక్కువగా ఉంటుంది.

- చొప్పర కమలాకర్, సైన్స్ ఉపాధ్యాయుడు, వెన్నాదేవి ఉన్నత పాఠశాల, సత్తెనపల్లి

20న పట్టణానికి విధుశేఖర భారతీ మహాస్వామి రాక

నరసరావుపేట లీగల్, మే 16, (ఆంధ్రజ్యోతి), శృంగేరి శారదపీఠం స్వామి విదుశేఖర భారతి మహాస్వామి ఈ నెల 20న పట్టణానికి రానున్నట్లు కపలవాయి విజయ్ కుమార్, వేదాంతంసీతారామ అవధానిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శృంగేరి శంకర మఠానికి నిర్మించిన మహా ద్వారం ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా రానున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 8గంటలకు స్వామివారు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

'50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలి'

వినుకొండ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నూజెండ్ల మండలం ముక్కెళ్లపాడు గ్రామ చిన్న, సన్నకారు రైతులు గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని పీడీఎం సీనియర్ నాయకుడు వై.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే రైతుల పక్షాన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు నూజెండ్ల మండల రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. మాజీ సైనికులకు ఇచ్చిన భూములు ఖాళీచేయమని చెప్పడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఎప్పటి నుంచో సాగు చేసుకుంటున్న భూములను రైతులకు చెందేలా హక్కులు కల్పించాలని కోరారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, మే 16, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు స్థానిక న్యాయస్థానాల ఆవరణలో జూలై 5వ తేదీన జాతీయ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ 13వ అదనపు జిల్లా న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నరసరావుపేట కోర్టు పరిధిలో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, బ్యాంక్ కేసులు, రెవెన్యూ కేసులు, మోటార్ వాహన ప్రమాద కేసులు, తదితర కేసులను రాజీమార్గంలో పరిష్కరిస్తామన్నారు.సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నట్లయితే కోర్టు ఫీజు వాపస్ చేస్తారన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి



మృతిచెందిన యోగేశ్వరి (20)

నరసరావుపేట రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంగుంట్లలో వివాహిత అనుమానాస్పదంగా వ్ముతి చెందింది. నూజెండ్ల మండలం పాత కొత్తపాలెంకు చెందిన యోగేశ్వరి (20)కి నరసరావుపేట లింగంగుంట్లకు చెందిన యేసుబాబుతో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. భర్తతో జరిగిన స్వల్ప ఘర్షణతో ఆమె ఉరివేసుకుని మృతిచెందింది. వారికి ఏడాదిన్నర వయస్సు ఉన్న కుమార్తె ఉంది. భర్త రైల్వే స్టేషన్‌లో రోజు వారి కూలీ. ఆమె మృతికి భర్త, అత్తమామలు కారణమని మృతురాలి తండ్రియోగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

21న కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా

నరసరావుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న మెగా జాబ్‌మేళా ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరుగుతుందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని బైపాస్ రోడ్డు జంక్షన్‌లో ఉన్న కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జరిగే ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కళాశాల డైరెక్టర్లు కే నాసరయ్య, కే వీరరాఘవులు, ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు వీసీహెచ్ రామాంజనేయులు, ఎం.వీరాంజనేయులు ఆవిష్కరించారు. జాబ్ మేళాలో 20 కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లమో, ఫార్మసీ చదివిన నిరుద్యోగులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. ఆదనపు సమాచారం కోసం 9160031006, 9160200652, 9866929567లో సంప్రదించాలన్నారు.

పేద ముస్లిం కుటుంబానికి సాయం

నరసరావుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని షాలేం నగర్‌కు చెందిన షేక్ కరిముల్లా ఇటీవలే మరణించాడు. అతనికి ముగ్గురు సంతానం, వారిలో పెద్ద కుమార్తె షేక్ ఆషాకు వివాహం నిశ్చయం అయింది. అయితే ఆర్థిక పరిస్థితి సరిగాలేక ఖబరస్థాన్ అభివృద్ధి కమిటీని ఆశ్రయించారు. పరిస్థితి తెలుసుకున్న కమిటీ వారు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సహకారంతో పెళ్ళి ఖర్చుల నిమిత్తం నరసరావుపేట ఖబరస్థాన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు షేక్ మీరావలి రూ.5వేలు ఆర్థికసాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో షేక్ అబ్దుల్ గఫార్, షేక్ మస్తాన్‌వలి, వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగేంద్రస్వామి పుట్ట వద్ద ప్రత్యేక పూజలు

గంటవారిపాలెం (శావల్యాపురం) మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు పంచాయతీ పరిధిలో ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్ సమీపంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి, మావురాల ఎల్లమ్మతల్లి దేవాలయంలో నాగేంద్రస్వామి పుట్టవద్ద శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు, ఆలయ పూజారి శ్రీనివాసరావు, భక్తులు నాగేంద్రస్వామి పుట్ట వద్ద అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రస్వామికి పాలు, పండ్లు సమర్పించారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించగా కమిటీసభ్యులు అన్నదానం చేశారు.

అకాల వర్షాలతో రైతులకు ఇక్కట్లు

మిర్చి, పొగాకు, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం



అవిశాయిపాలెంలో తడిసిన మిర్చిని ఆరబెట్టుకుంటున్న రైతు

నాదెండ్ల/యడ్లపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి): మిర్చి, పొగాకు రైతులకు ఈ ఏడాది కాలం కలసి రావడం లేదు. దిగుబడులు దక్కినా తగ్గిన ధరలతో ఆందోళన చెందుతున్న రైతులకు అకాల వర్షాలు మరింత నష్టాన్ని మిగిలుస్తున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతోపాటు కురిసిన వర్షానికి మిర్చి, పొగాకు రైతులు నష్టపోయారు. పలువురు రైతులకు చెందిన మిర్చి ప్రస్తుతం కల్లాల్లోనే ఉంది. రైతులు పరదాలు కప్పి జాగ్రత్తలు పాటించినా గాలులకు పరదాలు లేచి కొన్ని గ్రామాల్లో రైతులకు చెందిన మిర్చి తడిసింది. అదేవిధంగా నల్ల బర్లీ పొగాకు కొనేవారు లేకపోవడంతో పాటు భద్రపరచుకునేందుకు అవకాశం లేకపోవడంతో పలువురు రైతులు పొలాల్లోనే పొగాకును పందిళ్లలో ఉంచారు. ఈ క్రమంలో బర్లీ పొగాకు కూడా తడవడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది.

యడ్లపాడు మండలంలో...

యడ్లపాడు మండలంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పొగాకు, ఉద్యాన పంటల రైతులు విలవిల్లాడిపోయారు. ఇళ్ళవద్ద నిల్వ ఉంచుకునేందుకు వీలుకాక పొలాల్లో పందిళ్ళు వేసి పొగాకును రైతులు నిల్వ చేయగా భారీ వర్షానికి పూర్తిగా తడిచిపోయింది. కొండవీడు, కొత్తపాలెం, సంగంగోపాలపురం పరిధిలోని ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కొత్తపాలెం పరిధిలో రైతులు సాగుచేసిన దొండ పందిళ్ళు ఈదురు గాలుల ధాటికి నేలమట్టం అయ్యాయి. కాగా కొండవీడు, సంగంగోపాలపురం పరిధిలోని మామిడితోటల్లో ఈదురుగాలులకు కాయలు రాలిపడ్డాయి. అకాల వర్షాలకు దెబ్బతిన్న పొగాకు, ఉద్యాన పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చిలకలూరిపేటలో కుండపోత వర్షం

చిలకలూరిపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి పట్టణంలోని పలు ప్రాంతాలు జలమలమయ్యాయి. స్థానిక సుభానీ నగర్‌లో పిడుగుపడి కొన్ని గృహాల్లో విద్యుత్ పరికరాలు చెడిపోయాయి. చాలా ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

నరసరావుపేటలో తిరంగా ర్యాలీ

పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు



తిరంగ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, కూటమి నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో శుక్రవారం తిరంగ ర్యాలీ భారీగా నిర్వహించారు. ఉగ్రదేశం పాకిస్తాన్‌లో ఉన్న ఉగ్ర స్థావరాలను మట్టుపెట్టి శత్రుదేశం గుండెలపై గుద్ది ప్రపంచానికి భారతదేశ భక్తిని చూపిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం చేయడంలో భారత సైనికుల ధైర్యసాహసాలను స్మరించుకుంటూ ఈ ర్యాలీ జరిగింది. తిరంగ ర్యాలీని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించి పాల్గొన్నారు. సైన్యానికి దేశం మొత్తం అండగా ఉన్నామంటూ నినాదం ర్యాలీలో ప్రతిధ్వనించింది. వీరోచిత పోరాటం చేసిన సైనికులకు మద్దతుగా నరసరావుపేట పట్టణంలో ఎస్ఎస్ఎన్ కళాశాల వద్ద నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో 300 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. సైనికులకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, కె.నాగజ్యోతి, షేక్ మన్నాన్ షరీఫ్, ఎం.వెంకటసుబ్బమ్మ, గుత్తా అంకమ్మ చౌదరి, ఆర్.రామకృష్ణ, షేక్ అబ్దుల్ రవూఫ్, ఎం.శివప్రసాదు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగు వరుసల రహదారితో అభివృద్ధికి మలుపు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



నాగిరెడ్డిపల్లి-కొత్తపాలెం మధ్య గుండ్లకమ్మపై నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలిస్తున్న జీవీ, మక్కెన

వినుకొండ టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రూ.2,605కోట్లతో చేపట్టిన నాలుగు వరుసల జాతీయ రహదారి వినుకొండ నియోజకవర్గ అభివృద్ధికి కొత్తమలుపు అని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. గుండ్లకమ్మ వాగుపై తలపెట్టిన వంతెనలను పూర్తి చేయడంతో ఈ ప్రాంతం ప్రజల కష్టాలు తీరడంతో పాటు రాయలసీమకు అనుసంధానం మరింత మెరుగుపడుతుందన్నారు. రహదారుల వెంబడి పరిశ్రమల ఏర్పాటుతో మరిన్ని ప్రయోజనాలు రానున్నాయన్నారు. ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద వినుకొండ నియోజకవర్గంలో రూ.15.86కోట్లతో నాగిరెడ్డిపల్లి-కొత్తపాలెం మధ్య గుండ్లకమ్మ నదిపై నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులను ఆయన శుక్రవారం సందర్శించారు. అధికారులు, గుత్తేదారులను అడిగి పనుల పురోగతితో పాటు నాణ్యత వివరాలు అడిగి తెలుసుకున్నారు. 7.5మీటర్ల వెడల్పుతో, 250 మీటర్ల పొడవుతో ఈ వంతెన నిర్మిస్తున్నారని తెలిపారు. రూ.16.25కోట్లతో చేపట్టిన ఈ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఐదేళ్ల నిర్వహణ కూడా కాంట్రాక్టర్లకే బాధ్యత అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఇది ఫిబ్రవరి కల్లా, గోకనకొండ, పువ్వాడ మధ్య వంతెనను జూన్ నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. వంతెనల పూర్తితో వర్షాకాలంలో గుండ్లకమ్మ మీద ప్రయాణ అవస్థలు తప్పుతాయని సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ రహదారికి కూడా దగ్గరవుతుందని, రైతుల పంటల రవాణాకు కొంత వంతెనతో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, దూరం తగ్గడం వల్ల పెట్రోల్, డీజిల్ ఖర్చులు తగ్గుతాయన్నారు. నాలుగు వరుసల రహదారికి నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, సహకరిస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీకి రుణపడి ఉంటామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లల్లో వీటికి కనీసం పునాదులు ఎందుకు వేయలేకపోయారని ప్రశ్నించారు. వినుకొండ నుంచి ప్రారంభమయ్యే నాలుగు వరసల రహదారితో గుంటూరుకు గంటలో చేరుకోవచ్చని, అది ప్రజలకు పరిశ్రమలకు కూడా వరమన్నారు. వినుకొండలో వంద ఎకరాల్లో పారిశ్రామిక పార్కు గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో మరిన్ని పరిశ్రమలు కూడా తెస్తామని, మంత్రి లోకేశ్‌ను కూడా ఆ విషయంలో సహకారం కోరినట్లు ఆయన తెలిపారు. ఒక వైపు హైదరాబాద్, మరో వైపు చెన్నైకు మరింత నెట్‌వర్క్ రోడ్డు ఉండటం వినుకొండకు మరెంత మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులతో పాటు జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కును అందజేస్తున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

రుణాలను సకాలంలో చెల్లించాలి

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, మే 16 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలకు సిబిల్ స్కోరు బాగుంటేనే ప్రభుత్వ రుణాలు, డ్వాక్రా రుణాలు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందని, కాబట్టి మహిళలంతా తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించి సిబిల్ స్కోర్‌ను పెంచుకోవాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో స్వయం సహాయ సంఘాలు, యానిమేటర్లతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. పీఎం అజయ్, ఉన్నతి పథకం ద్వారా వినుకొండ నియోజకవర్గానికి చెందిన 13మంది డ్వాక్రా మహిళలకు రూ.24.5లక్షలు విలువైన రుణాల చెక్కును అందజేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక సాధికారత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని, పీఎంఈజీపీ పథకం కింద వినుకొండకు 156మందికి అవకాశం ఇచ్చారని, అధికారులు సిబిల్ స్కోర్ ఉన్నవారిని వెతికి ఎంపిక చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే రుణాలు పొందడంలో వినుకొండను రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలపాలన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకొన్నవారికి రూ.20వేలు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. రుణాలు బాగా రికవరీ చేయించినవారిలో మండలానికి ఇద్దరి చొప్పున ఎంపికచేసి ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీల తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

● టీడీపీ మండలాధ్యక్షుడు సాంబశివరావు

శావల్యాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీ సభ్యులు పనిచేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు అన్నారు. మండలంలోని కనమర్లపూడి, ఇర్లపాడు గ్రామాల్లో టీడీపీ నూతన కార్యవర్గసభ్యుల ఎన్నికలను శుక్రవారం నిర్వహించారు. కనమర్లపూడి టీడీపీ అధ్యక్షుడిగా మర్రి నరేంద్రకుమార్, ఉపాధ్యక్షుడిగా ముట్లూరి పవన్‌కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా సాతులూరి ఏసయ్యలను ఎన్నుకొన్నారు. ఇర్లపాడు టీడీపీ అధ్యక్షుడిగా వెలగపూడి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అంగలకుర్తి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఈర్ల హరిబాబులను ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు సీనియర్ నేతలు పార్టీ కండువాలు కప్పి సత్కరించారు. టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గోరంట్ల హనుమంతరావు, గద్దె మస్తాన్‌రావు, టీడీపీ నేతలు ఒత్తుల వెంకటేశ్వర్లు, దొడ్డా ఏడుకొండలు, కోటా హరిబాబు, వెనిగండ్ల అంజనేయులు, బోడెపూడి శంకర్, కాసరగడ్డ వెంకటరత్నం, ముక్కపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంచాయతీల గ్రేడ్‌ల మార్పునకు ప్రతిపాదనలు

శావల్యాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 15గ్రామ పంచాయతీల గ్రేడ్‌లు మార్చేందుకు డీపీవోకి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని జనాభా ప్రాతిపదికన ప్రస్తుతం గ్రేడ్-5లోని వయ్యకల్లు, బొందిలిపాలెం, ముండ్రువారిపాలెం, చిన్నకంచెర్ల, ముండ్రువారిపాలెం, కొత్తలూరు, ఇర్లపాడులను గ్రేడ్-3కి, గ్రేడ్-4లోని గుంటుపాలెంని గ్రేడ్-3కి, గ్రేడ్-3లోని కనమర్లపూడి, మతుకుమల్లి, పోట్లూరులను గ్రేడ్-2కి, గ్రేడ్-3లోని కారుమంచి, వేల్పూరు లను గ్రేడ్-1లోకి మార్చాలని ప్రతిపాదనలు పంపామన్నారు. గ్రేడ్-3లోనున్న శానంపూడిని అదే గ్రేడ్‌లో కొనసాగించాలని, ప్రతి మండల కేంద్రాన్ని గ్రేడ్-1లోకి మార్చాలన్న ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం గ్రేడ్-4లోని శావల్యాపురంను గ్రేడ్-1లోకి మార్చాలని ప్రతిపాదించామన్నారు. 2వేలలోపు జనాభా ఉంటే గ్రేడ్-3, 2నుంచి 4వేలవరకు ఉంటే గ్రేడ్-2, 4నుంచి 10వేలవరకు ఉంటే గ్రేడ్-1, 10వేలకు పైన స్పెషల్ గ్రేడ్ వర్తిస్తుందన్నారు. ఆయనతో పంచాయతీ కార్యదర్శులు చింతా శ్రీనివాసరావు, బాలపరమేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువ రైతు మృతి

నూజెండ్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మృత్యుంజాపురం గ్రామానికి చెందిన యువరైతు చెన్నబోయిన నాగేశ్వరరావు(26) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పొలం పనుల నుంచి సాయంత్రం ఇంటికి వచ్చిన అనంతరం గుండెల్లో నొప్పిగా ఉందని తెలపటంతో హుటాహుటీన వినుకొండ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. నాగేశ్వరరావుకు భార్య, పిల్లలు ఉన్నారు. ఉత్సాహంగా వ్యవసాయ పనులు చేసే నాగేశ్వరరావు అకస్మాత్తుగా మృతి చెందటం గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి.

రెండు లారీలు ఢీ.. తప్పిన ప్రమాదం

శావల్యాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న రెండు లారీలు ఎదురుగా ఢీకొనడంతో ఒక లారీ అదుపుతప్పి దుకాణాల మీదుకు వెళ్ళడంతో ప్రజలు భయాందోళనలతో పరుగులు తీశారు. కొంతమేర ఆస్తి నష్టం తప్ప ప్రాణ నష్టం జరగక పోవడంతో ప్రజలంతా ఊపిరి పీల్చుకొన్నారు. ఈ ఘటన గుంటూరు-కర్నూలు జాతీయ రహదారి మార్గంలో మండల కేంద్రమైన శావల్యాపురంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజమండ్రి నుంచి బెంగుళూరుకు ఎరువుల లోడుతో వెళుతున్న లారీ శావల్యాపురం సెంటర్లోని ఆంజనేయస్వామి గుడి వద్ద బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి వినుకొండ నుంచి నరసరావుపేట వైపు వెళుతున్న మరోలారీని ఢీకొట్టింది. లారీడ్రైవర్ సయ్యద్ జాకీర్ హుస్సేన్ లారీవేగాన్ని నియంత్రించలేకపోవంతో లారీ రోడ్డుకు తూర్పునున్న షాపుల పైకి దూసుకుపోయింది. షాపుల ముందు అమర్చిన రేకులు ధ్వంసం అయ్యాయి. శానంపూడికి చెందిన అశోక్ తన సెల్‌షాపు ముందుంచిన పల్సర్ బైక్ పైకి లారీ దూసుకుపోవడంతో బైకు నుజ్జునుజ్జయింది. రెండు లారీలు ఢీకొన్నప్పుడు పెద్దశబ్దం రావడంతో షాపుల్లోని వారంతా భయంతో బయటకు పరుగులు తీయడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకొన్న వినుకొండ రూరల్ సీఐ ప్రభాకర్‌రావు, ఎస్ఐలు లోకేశ్వరరావు, కృష్ణారావు సంఘటనస్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను పునరుద్దరించారు. శావల్యాపురానికి చెందిన జక్కా సాంబయ్య, లారీడ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఘనోరే

బియ్యం పంపిణీలో ఆరోపణలు రాకూడదు

● రెవెన్యూ అధికారులతో జేసీ ఘనోరే

నరసరావుపేట కల్చరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీలో ఎక్కడా ఆరోపణలు రాకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ ఘనోరే తహసీల్దార్లను హెచ్చరించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ సమావేశ మందిరంలో సత్తెనపల్లి డివిజన్‌లో రెవెన్యూ సమస్యలపై రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని రీ-సర్వే, సివిల్ సప్లయిస్, రెవెన్యూ సమస్యలపై క్షుణ్ణంగా మాట్లాడారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగితే సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వెంటనే రెవెన్యూ డివిజన్ అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. అక్కడా పరిష్కారం కాకపోతే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చూపుతానన్నారు. సివిల్ సప్లయిస్ విధానంలో ఎక్కడా ఆరోపణలు రాకుండా సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పైఅధికారులకు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఏడీ సర్వే, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, డివిజన్ పరిధిలోని రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.



ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ తదితరులు

నరసరావుపేటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నరసరావుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రజల వద్ద వారి సమస్యల వినతి పత్రాలను తీసుకున్నారు. పలు సమస్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.



జీడీసీసీబీ మాజీ ఛైర్మన్ నల్లపాటి శివరామచంద్రశేఖరరావుతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌రావు తదితరులు

నల్లపాటికి కేంద్రమంత్రి పెమ్మసాని పరామర్శ

నరసరావుపేట టౌన్, మే 16 (ఆంధ్రజ్యోతి): మాజీ జీడీసీసీబీ ఛైర్మన్ నల్లపాటి శివరామచంద్రశేఖర్‌రావును శుక్రవారం నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పరామర్శించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ప్రభుత్వ చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే గోనుగుంట్ల ఆంజనేయులు, జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, తదితరులు ఉన్నారు. నల్లపాటి శివరామచంద్రశేఖర్‌రావును కేంత్రమంత్రి పెమ్మసాని మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు, మే 16 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కొత్తపాలెం గ్రామ పరిధిలో విద్యుత్ లైన్లు మార్పిడి కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొత్త లైన్లు వేయడం, తీగెల మార్పిడి కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని డీఈ కోరారు.



శావల్యాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి : పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య

శావల్యాపురం, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధి అత్యంత ప్రమాదకరమని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శావల్యాపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి రావిపూడి రమ్య అన్నారు. జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని డెంగీ లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పీహెచ్‌సీ నుంచి శావల్యాపురం సెంటర్ వరకు వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రమ్య మాట్లాడుతూ దోమకాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుందని, జ్వరం, తలనొప్పి, కాళ్ళనొప్పులు, ప్లేట్‌లెట్లు పడిపోవడం, శరీరంలో ఏదో ఒక భాగంలో రక్తస్రావం జరగడం వంటివి డెంగీ వ్యాధి లక్షణాలన్నారు. డెంగీని నివారించేందుకు ప్రజలంతా ఇంటి పరిసరాల్లో నిల్వనీరు లేకుండా చేసుకోవాలని, మురికి కాలువల్లో కిరోసిన్, క్రూడ్‌ఆయిల్ వంటివి చల్లుకోవాలన్నారు. డెంగీపై అశ్రద్ధ వహిస్తే ప్రాణాపాయం కలుగుతుందన్నారు. సూపర్‌వైజర్‌లు ఏడుకొండలు, ఉమాదేవి, స్టాఫ్‌నర్స్ లక్ష్మీప్రసన్న, ల్యాబ్ టెక్నీషియన్ సీతారామయ్య, ఫార్మసిస్ట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.